ያልተገደበ

ውይይት

ለሁሉም

ዜጎች

KABB129B161

సోమసుందర్

కవితా సమ్మేళనం

మీనుల హైకూలు



కళా కేళీ ప్రచురణలు

ఏలూరు.

533460

ప్రచురణ : 1977 ఫిబ్రవరి
ప్రథమ ముద్రణ : వేయి ప్రతులు
శ్రీరామా ప్రింటర్స్, పిఠాపురం.
సర్వస్వామ్య సంకలితం,
కవర్ డిజైన్ : శ్రీ శీలా వీర్రాజు.

ఇతర కృతులు : కవితలు

వజ్రాయుధం : 1949 మార్చి

కాహళి : 1952

గోదావరి జలప్రళయం : 1953

రక్తాక్షి : 1957

మిణుగురులు : 1962

సోమరగం - సుందరకాండ : 1963.

మేఘసందేశం : 1963

కథానికలు

బానిసల దేశం : 1950

నాటకం : మంది - మనిషి 1953
(ఏర్నెస్ట్ టూలర్ కు అనువాదం)

నాటిక : రామ్ (బందుల) రాజ్యం
1951

విమర్శ : శేషేంద్రకాలం 1976 ఆగస్టు

త్వరలో : కవితా సంపుటాలు

వెన్నెలలో కోనసీమ; మా ఊరు మారింది; రాలిన ముత్యాలు;
ఒక్కొండలో వేయి శిల్పాలు; ఆగతానికి శుభారంభం

సాహితీ విమర్శలు :

1. వర్తమాన సాహిత్యంలో వజ్రరేఖలు, 2. తిలక్ కవితా సమాలోచన,
3. రుధిరజ్యోతిర్దర్శనం, 4. ముక్తచ్ఛంద కవితా స్వరూపం,
5. శ్రీ కృష్ణ సాక్షాత్కారం

Sole Distributors : విశాలాంధ్ర ప్రచురణాలయం,
విజయవాడ 2

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాద్.

Kalakeli Publications,
PITHAPURAM.
533450 A. P.

రాజకీయాలూ సాహిత్యమూ

ఒకే కొమ్మకు పూసిన రెండు పూవులుగా

భావించే బంధురావేశ స్ఫూర్తి

శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారికి

ప్రియ మిత్రమా,

ఎప్పుడో వచ్చీరాని

యౌవనారంభపు తొలిపేకువలో

క్రుంగి పోతున్న శ్రమైక జీవనుల

ఖిన్నవదనం వంటి దేశమాత

దరిద్రతా సంచన్న స్వరూపాన్ని చూశాం !
మన యెదుట సాక్షాత్కరించిన
ఖే దాన్ని పోకార్చడానికి మార్గాలను
అన్వేషిస్తూ కార్యరంగానికి ఉరికాం ...
పసితనాల మెత్తని ఎముకలింకా
గట్టిపడి రాలుదేరని వయస్సు ... !

మతాలతో కులాలతో లక్షవిభేదాలతో
ధనస్వాముల దోపిడీల దాష్టీకంతో
కృశించి పోతున్న ఈ దేశంలో
సమతా ధర్మసంస్థాపన మొక్కటే
జనతా సమస్యా పరిష్కారమన్న దీక్షతో
రుగ్మతలన్నిటికీ
విమోచన మార్గమన్న విశ్వాసంతో
నిరంతరాయంగా పరిశ్రమించాం.
మన ఇరువురి లక్ష్యమూ ఒక్కటే...
మన ఇరువురి గమ్యమూ అదే ... !
అకుంఠిత విశ్వాసంలో తేడా లేదు.
కాని పథాలు భిన్నించాయి; అంతే !

అవునవును, అది 1942 ...!
ఎంతచప్పున వచ్చేస్తోంది – 1982...!

ఆనాడు మనవంటి కొద్దిమంది కన్నకలలే
ఈనాడు మనదేశం తన సదాశయ కాంతిరేఖగా
సంతరించుకొని – పురోగమిస్తోంది!
మహానేత నెహ్రూజీ ధర్మమా అని
మనజాతి నవదీధితులు వెలార్చుకొంది.

నేటి మనజాతి లక్ష్యం –
ఆనాటి మన లక్ష్యమే!
ఇలా మన హృదయాలు
స్వరమేళనపొందిన శుభ తరుణంలో
ఈచిరస్మరణీయ మాధుర్యాన్ని కీర్తిస్తూ
సస్నేహంగా ఈ కవితా గానాల్ని
మీ సహృదయతకు ఆప్యాయంగా
నివేదిస్తోంది నా హృదయం!
సావధానంగా చిత్తగించండి!

పిఠాపురం
20–12–1976

భవదీయ,
సోమసుందర్.

కృతజ్ఞతాంజలి

దాదాపు పుష్కరకాలంగా నా కవితలు గ్రంథాలుగా ప్రచురణ పొందలేదు. కాని ప్రముఖ పత్రికలలో ప్రచురితమవుతూనే ఉన్నాయి. పత్రికా సంపాదకుల వాత్సల్యమే దీనికికారణం, వారందరికీ సదా నేను కృతజ్ఞుణ్ణి.

ప్రఖ్యాత సాంస్కృతిక మాస పత్రిక భారతిలో నా కవితలను సాదరంగా ప్రచురిస్తూ వచ్చిన మహామనిషి స్వర్గీయ శివలెంకశంభూప్రసాద్‌గారికీ, వారి తనయులూ మాతామహ పితృపాదులకు ఉత్తమ ప్రతినిధీ శ్రీ రాధాకృష్ణగారికీ సర్వదా నా కృతజ్ఞతాంజలి.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక సంపాదకులు శ్రీ విద్వాన్ విశ్వంగారికీ, ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక సంపాదకులు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారికీ ఎంతో కృతజ్ఞుణ్ణి. ఆంధ్రజ్యోతి దిన పత్రిక సంపాదకులూ నా ప్రియ మిత్రులూ అగు శ్రీ నండూరి రామమోహనరావుగారికి సదా కృతజ్ఞుణ్ణి. విశాలాంధ్ర దిన పత్రిక సాహితీ సంపాదకులు ఆదరంతో నా కవితలకు ఉన్నత స్థానమిచ్చి ప్రోత్సహిస్తూ వచ్చారు. దానికి కారణ భూతులైన సర్వశ్రీ తుమ్మల వేంకటరామయ్య, నిడమరి ఉమారాజేశ్వరరావుగార్లకు

స్నేహ పూర్వక కృతజ్ఞతాభివందనాలు. కృష్ణా పత్రిక జయశ్రీ మాస పత్రికల సంపాదకులకు కూడా నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

నా కవితలను సంపుటాలుగా ప్రచురించమని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూన్న కవి సోదరుడు శ్రీ కుందుర్తికి, కవుకిజైక్ చిత్రించి యిచ్చిన కళా హృదయుడు శ్రీ శీలా వీర్రాజుగారికీ నా సుమనస్సుమాలు.

ప్రతి దశలోనూ నాకు చేదోడు వాదోడుగా ఉంటున్న నా ఆత్మీయ మిత్రులూ నా సోదరులూ సర్వశ్రీ చలికాని భావనరావు, మిరియాల రామకృష్ణగార్లకి నా ధన్యవాదాలు తెల్పకుండా ఉండలేను.

ఉత్సాహవంతులూ యువ కార్మికులూ శ్రీరామా ప్రింటర్సువారు. ప్రెస్‌కు సంబంధించిన వనరులు తక్కువైనా, కార్మికుల కో-ఆపరేటివ్ సంస్థలాగ దానిని నడుపుతున్నారు. వారందరూ ఎంతో అభిమానంతో పనిచేశారు. వారికి నా ఆశీస్సులు.

ఇందరి సహాయమూ ఒకెత్తూ, ప్రియ మిత్రులు పూజ్య శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి సహాయం ఒకెత్తూను. వారీ గ్రంథ ప్రచురణకు — ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పక్షాన వేయి నూట పదహారు రూపాలు

111

గ్రింటు దయచేసి ఎంతో సహాయం చేశారు. ఈ సాహితీ ప్రియంభావుకులకు నా కృతజ్ఞతా నమోవాకాలు.

చిరకాల ప్రియ మిత్రులు, సాంఘిక సంక్షేమ, సాంకేతికవిద్య, పరిభృతిశాఖల మంత్రివర్యులు సాహితీ రస హృదయులు గౌరవనీయులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారు ప్రధాన శ్రోతగా ఈ కావ్యాన్ని సమాదరించి నా కెంతో ఆనందం కలిగించారు. వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతాంజలి సమర్పిస్తూ, మంగళ మహాశ్శ్రీలనందిస్తున్నాను.

పాఠకులందరికీ నా అభివాదాలు.

కళాకేళి నికేతన్ | ఆవంత్స సోమసుందర్.
శీలాపురం : 538450 | 28—1—1977

అనుక్రమణిక :

1 భవిష్యద్గీత

8 అనలకిరీటం

12 జీవనసురభిళం

16 చేతస్స్పర్శ

18 ఇది భయంకర కాళరాత్రి

22 మా-నవమంత్రం

25 చంద్రునిపై చేవాలుచేసి శపిస్తున్నాను

29 జ్ఞాతకాలత్రయి

35 ఉగ్రాటవి

37 మహామహిమాన్విత

43 స్వప్నించకు ...

44 రుద్రనేత్రం తెరుస్తానీరాత్రి

51 అభినేతి ఆత్మహత్య

53 ఎలిజీకాదు ఎపాలజీ

57 చీకటిని ద్వేషిస్తాను

59 విషాదజనుషాంధ్రం

61 ఇది సుదీర్ఘ చరమరాత్రి

66 నాగరిక వధూనిక

67 స్వప్నవాస్తవదత్త

75 రెల్లుదిబ్బలు

77 సుప్తనదిలో తప్తజలాలు

82 తొలకరిమబ్బులు

84 హేమంతనిశ్శాంతం

98 లోహితకవచం

విన్నపం

ఎంత జాగ్రత్త తీసుకొన్నా అచ్చుతప్పులు తప్పలేదు. ఈమించి ఈ క్రింది సవరణలు చేసుకోవలసిందిగా పాఠకులను విన్నవించుకుంటున్నాము.

పుట	పంక్తి	సవరణ
11	1	మమ్మల్ని
11	11	శాంతీ మమ్మల్ని
14	13	బాహుళ్యం
24	18	సృష్టిద్దాం
25	6	కోకాకోలా
34	5	శార్జెంట్
35	15	పరిపక్వం
53	18	తరుకోటరం
65	2	ఘోషించేవి
65	9	కొండొక
65	17	పరిపూతమైంది
65	21	వివరణ ప్రచురించక
72	4	మార్మిక
75	8	మానుషత్వం

పుట	పంక్తి	పవరణ
78	10	భల్లూకాలవంటి
83	17	కేంద్రీకరిస్తాను
86	12	మేదురహాసం
95	6	నిష్ఫల

భవిష్యద్గీతం

ఆర్యులారా అనార్యులారా
వెరసి అందరూ నా సోదరులారా
రండి రండి ఈవేళే నా జన్మదినోత్సవం
నాకు నేనే జరుపు కుంటున్న మహోత్సవం
పట్టు చీరల గరగరలు లేకపోతే వేడుకే లేదు
రండి సీతాకోక చిలుకలారా, పసందుగా రండి
నాకైనేను పిల్చుకునే పేరంటానికి దయచేయండి.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య
కాలం కుంటుతూ నడుస్తున్న వ్యవధిలో
శాంతి పేరుతో ప్రపంచం మరోకొత్త యుద్ధానికి
తయారీ తిండి తింటున్న దుర్భాగ్య సమయంలో –
నేను జన్మించాను – స్వరకల్పన చేయాల్సిన గీతంలా.

నలభై నాలుగేళ్లు గడచిన తర్వాత
ఇప్పుడెందుకనో చిన్నబోతోంది నా వయస్సు
నేను పుట్టిన నాటి కాలాన్ని దేశాన్ని విశ్వాన్ని
పరామర్శించుకుంటున్న ఈ ఘట్టంలో
సిగ్గుపడుతోందెందుకనో నా మనస్సు.
ఎక్కడ ప్రారంభమో ఎన్నెన్ని పాత్రలతో ప్రారంభమో
పిసరంతైనా దప్పి తీర్చిందా కవితా పయస్సు ?

నేను ఉజ్జయినిలో పుట్టిన వాణ్ణి కాకపోయినా
ఇంత పెద్దరికం వచ్చిం తర్వాత నా గురించి నేను
ఉజ్జాయింపుగానైనా అంచనా వేసుకోవాలి కదా కాస్త.

నిజమే నేను – కవిత్వమూ జీవితమూ
ఇద్దరింతులు అవిరామంగా ఆడుకునే
పోటీ ఆటలలో బంతిని
ఆధునికాంధ్ర సరస్వతి తన కచ్చపికి
అలంకరించుకొన్న వివిధ సురభిళ కుసుమాలతో
కూర్చిన బంతిని.

ఎన్నో చిరు మొగ్గలు తమ్మికాము చిదిమేసుకోగా
నవంబరులో విరిసిన బృహత్తరమైన చేమంతిని
ఇరవై ఐదు వసంతాలుగా ప్రకాశ మానమవుతూన్న
కవితా ప్రతిభోత్సవంలో
అహరహ గానం వినిపించిన కలకంఠాన్ని
తెరచుకొన్న నా హృదయిసజ్జతా వాతాయనంలో
ఎన్నెన్నిని తొంగి చూశాయని – గోర్వెచ్చని కోరికలు?
శైలూషికా వలాహకాలు? శరచ్చంద్రరేఖా
శ్వేత పత్రాలు?
అతతాయి వాంఛా ప్రచ్ఛన్న స్వరూపాలు?

నా గురించిన పరిచయ వాక్యా లింతకన్న ఏం చెప్పను ?

ఇన్ని శరత్కాలాల సువ్యక్త జీవితంలో

ఎన్నెన్ని తప్పులు చేశానో

ఎన్నెన్ని మస్పిశాలు మాట్లాడానో

తొందరపాటుతో ఎన్ని మార్లు పోట్లాడానో

ఎందరు మిత్రుల్ని శత్రులుగా చేసుకొన్నానో

ఏదీ ఎక్కడ లభిస్తుంది పట్టిక ?

నా దప్పితీర్చి సేద తేర్చిన దెక్కడుందా పుట్టిక

నలభైనాలుగు సోపానా లెక్కి వచ్చిన నేడు

వెనక్కి తిరిగి చూసుకుంటే కనిపించేవి కొన్నే ఉన్నాయి

సమీచీనంగా మెరిసే వెలుతురు మెట్లు

రసవాహినికి గట్లు.

మిగిలిన వన్నీ అవ్యక్త మనోహర హాసరేఖల కావల

మసక మసక ముసుగులలో దాగిన కన్నుల మిరుమిట్లు.

యీ వనారంభ వేళా చారు వదనంతో

హృదయంతో నేను వీక్షించాను

నా దేశాన్ని సంక్షుభిత సమూహాన్ని

"ధనంజయుల" దుర్నిరీక్ష్య క్రోధా కలిత వ్యూహాన్ని

ఆ సమయంలోనే నన్ను ముంచెత్త నారభించాయి
గురజాడ వెదజల్లిన వెలుగు జాడ విరిజాజులు
దేశమంటే మనుషులని తెలిపిన సుతారపు పరిమళాలు

నా పదహారో యేట ఓరి ఆపదల వరించిన ఒకానొక
విచిత్ర సన్నివేశంలో అందుకున్నాను చలం అండ!
అది మొదలు ఆ నడిచే అగ్ని పర్వతంనుంచి –
కొంతలో కొంత జీవుణ్ణి అంతర్ముఖుణ్ణిగావించి
భౌతికేహాల సార్వత్రికేతి బాహ్యాలనుంచి
కళాలోకాల రహస్యాలను కున్నతీ కరించి
సబ్లిమేట్ చేసి రక్షించాడు టాగోరు.

ప్రారంభ యౌవనోద్వేగమదోన్మత్త పథాలలో
రవీంద్రుని తొలికిరణ సందోహం నా గుండెల్ని చేరి
ఉదారంగు వెలుగు రేకల నేటవాలుగా ప్రసరించి
మోదోత్సవ జీవన లహరిలో కవితా హృదయాన్ని ముంచి
నా తనుపల్లరిపై "అమృత వర్షిణి" కురిపించకపోతే
చింతనా మయ భావనా వ్యగ్రతను రక్షించకపోతే
ఎంతటి విషాద జనుపాంధ్యమై పోయేది బ్రతుకు ?
ఎంతటి నిషాద విషయాసక్తమై పోయేది బ్రతుకు?

సరిగ్గా ఆదశలోనే తెలుసుకున్నాను.
మనిషి జీవితాంతమూ జ్ఞానాన్వేషే నన్న సంగతి.
ఇప్పుడు నా కనిపిస్తున్నది మరొకటి –
మనిషికి తాను జ్ఞాని నయ్యానన్న భ్రమల కొసగాలులు
తాకేసరికి ఆయురాయం ముగిసి పోతుందని!
ది

నాలోపల దట్టంగా చీకట్లు ముసరినపుడు
భయాల ఏకాంతపు పిరికి తనాలు కలచినపుడు
ఆలోచనల కీచురాళ్లు ఒక్కటే మ్రోతగా అరచినపుడు
నా చుట్టూ భూగోళం నానా గ్రహగోళం జరుపుతూ
ప్రదక్షిణం చేస్తున్నపుడు
కాతరమైన నిస్సహాయమైన దీనమైన
దరిద్రతాధీనమైన ఒంటరి తనాలలో
కృష్ణశాస్త్రి పిలుపూ వలపూ నా గుండెల్ని నిమిరింది.
కన్నీళ్లు తుడిచి ఓదార్చింది.
స్వాత్మ కేతివృత్తాల ఒలుపిడినుంచి సంయమనం నేర్పింది.

నా చుట్టూ ఉన్న లోకాన్ని శ్రీమాఖిన్న వదనాన్ని
తప్త నీరవ దరహాసాన్ని, గత సువాసనా ఛాయామాపాన్ని
వీక్షించడం నేర్చుకొన్నాను
అపుడు నా కొకే ఒక్క మహత్స్వరూపం

సాక్షాత్కరించింది – పిడుగుల జడిగా
రెండు వైపులా వెలిగించిన మెగ్నిపియం తీవలా
మెరసింది, మెరసింది, లోకాన్ని క్రొకార్కరు
కాంతులతో వెలిగించింది. ఆ మహాశక్తి వేరే శ్రీ శ్రీ!
అసంతాంధ్ర సాహితీ మహేతిహాసం
వెలయించిన మహత్తూర్ణ సుహాసం!

నేను కవిగా పుట్టింది మొదలు
రచించబడుతూనే ఉన్న భవిష్యద్గీతాన్ని.
భవిష్యదు జ్వాల గగనం పై అనిష్కరించబోతూన్న
సప్తవర్ణ దీధితీమయ మహేంద్రచాపాన్ని.

ఆకాశ శూన్యంలో అనేకాకృతులతో
పోగులు పోగులుగా యథేచ్ఛగా సంచరిస్తూన్న
సమస్త మేఘాల్లారా – రండి.
నా పాదాలక్రింద కమ్మటి నల్లటి పుడమి
వానధారల దారాలతో కుట్టుకుంటుంది పురిటి బాంత
ఆ గత మానవునకు స్వాగత గీతాన్ని
అలాపించండి సుంత.

నేనే కర్తని – భోక్తని నేనే
నేనే స్రష్టని – సృష్టిని నేనే
నవలోకానికి సుదర్శన చక్రధారిని నేనే
సామాన్యుని మాన్యతగునిగా చేయనవతరించిన
తారుణ్య శక్తిని నేనే –
ఈ యుగానికి మకుట ధారిని,

ఇంతకన్న నే చేసేదేముంది విందు?
ఆలోచనామృత కవితా రసాయన మందించడం తప్ప
అవధరించండి సోదరులారా
నేనే యుగధర్మాన్ని – సమధర్మాన్ని నేనే
నిస్సందేహంగా స్వీకరించండి నన్నే
విరచించ బడుతూన్న భవిష్యద్గీతాన్ని.

(ఆకాశవాణి ప్రసారితం 1968 నవంబరు)

అనలకిరీటం

ఉద్ధరించుతల్లీ శాంతీ మమల్ని

రొంపినుంచి రుజలనుంచి సమరబీభత్సవంనుంచి

పాప పంకంనుంచి రక్తాంచల మహోగ్రనంనుంచి

భ్రాతృహాననాలనుంచి శిశుదహనాలనుంచి

దుఃఖాలనుంచి ఆక్రోశా లావేశాలనుంచి

ఉద్ధరించు తల్లీ శాంతీ మమ్మల్ని

ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని

నిసుగులం శిశువులం అమాయకులం

హాలాహలంలో హాహాకారాలు కల్పించవొద్దు

దురహంకారుల కోలాహలం వినిపించవొద్దు

నరరూపరాక్షసుల మాయావాగురలు ప్రయోగించవొద్దు

రవ్వంతైనాచాలు ఈ బ్రతుకు పులుసుముద్ద

యుద్ధాల ఊర్పుల తొందరలతో పొలబారించవొద్దు

ఒద్దు తల్లీ హంతకులను హద్దు మీరించవొద్దు

ఉద్ధరించు తల్లీ శాంతీ మమ్మల్ని

ఉద్ధరించు తల్లీ శాంతీ మమ్మల్ని
రెక్కలు తెగిన పిట్టలం తడబడుతున్నాయి కాళ్లు
ఎంత ప్రయాణించినా దూరమవుతూనేవుంది గమ్యం
రాబందులు గ్రద్దలు డేగలు కాకులు తంతున్నాయి తలల్ని
ఆరముగ్గిన ద్రాక్ష పళ్లవలె మెరిసే మా నేత్ర గోళాలపై
ఈగలు ఈగలు-అబ్బా ముసురుతున్నాయి పోగులు ప్రోగులు
దురాశల బూడ్దెంకలు తినేస్తున్నాయి మా గుండెల్ని
ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని

ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని
గ్రామాల విద్యుదీకరణతో భయపడిన చీకటి
చెల్లాచెదరై నరహృదయాలలో దాగొని
తేపిణే వేస్తోంది సజావుగా ! ధనాన్ని ధనం
పెండ్లిచేసుకొని కంటోంది భూతాల్ని, మానవత్వాన్ని
విద్యాలలో కర్యాలలో దెయ్యాలకందిస్తోంది
అగ్రతాంబూలంగా ! సాగుతోంది సైతానుల షోరోహిత్యం
ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని

ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని
ఆకాశం నలుమూలలా క్రికిరిసిన
తుఫాను మేఘాలు పన్నతున్నాయి కుట్రలు

కాలం కసాయివాడి కత్తి పదునుగా
తరుగుతోంది అమాయకపు మేకల పీకలు
పొంగి పొరలుతూన్న నరరక్తం మేదినీ హృదయాన్ని
సీమాతి క్రమణం చేస్తోంది సర్వ్రికా ! నిజం మాతా
మేము సగర్వంగా కీర్తించుతున్న ఈ నాగరికత
మాకు సగం ఘోరశాపం ! సగమే వరప్రసాదం
ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని

ఉద్ధరించుతల్లీ శాంతీ మమ్మల్ని
నేలతల్లి వక్షంపై చెవిపెట్టుకువించే
ఎడతెరిపిలేకుండా వినిపిస్తున్నా యార్తక్రందనలు
హాహారవాలార్తఘోషలు ! చితాభస్మాల గుసగుసలు
ప్రకంపిస్తున్నాయి చర్మంక్రింది ఎముకలు
పురాస్మృతుల బీభత్స దృశ్యాల నకళ్లు
గుండె వెనకాలదాగి భయపెడుతోంది మృత్యువు
వికటాట్టహాసాలు ప్రసరిస్తోంది మానవతా శత్రువు
అనిలం కుసుమపేశల సురభిశ్వాసను కాక
విస్ఫులింగాలవంటి దుర్వార్తలను మోసుకొస్తోంది.
ఉద్ధరించుతల్లీ శాంతీ మమల్ని

ఉద్ధరించుతల్లీ శాంతీ మమల్ని
శాపగ్రస్తుల్ని పీడితుల్ని బాధితుల్ని
అశ్రుమలినుల్ని సర్వస్వం కోల్పోయిన దీనుల్ని
మంచికి మానవతకు నీకు
అనలకిరీటం తొడిగాడు నరుడు —
వాడు దానవుడికీ వానరుడికీ వారసుడు
దుశ్చింతకో దుర్మార్గానికీ కుమారుడు
అధికార పానమత్తుడై గర్జిస్తున్నాడు
అమంగళాన్ని దౌర్జన్యాన్ని శిక్షించి
రక్షించు సౌజన్యాన్ని, రక్షించు మమతల్ని కవితల్ని
ఉద్ధరించుతల్లీ శాంతి మమల్ని...!

1967 స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక
సంచిక : ఆంధ్రి ప్రభ సచిత్ర వారపత్రిక
రచన : 4—7—67

జీవన సురభిళం

నిన్నటివరకూ మనం
భానిసలం భీరువులం తీతువులం ఆర్తులం
నిన్నంటే బహుశాకావచ్చు రెండు దశాబ్దాలకాలం
గతం తెదీలతో నిమిత్తంలేని కొలమానం.

నేడు మనం స్వతంత్రులం
వ్యష్టిసత్వంతో జాతికి సమష్టి జీవన సత్తాక
ఎగరేశాం మెరిపించాం ఝళిపించాం పతాక !

కాని నేటికాలపు భరతదేశం
పదోయీత తాలూకు బడుగుగొడ్డులాగుంది
ముప్పదేళ్లుగా సాగుతున్న
మూడో తరగతి రైలు పెట్టెలాగుంది
సామానులూ పిల్లలూ సల్లులూ
ఉస్సుర్లులూ కకూకాసు కంపులూ
కిటకిటలాడుతూ బహుకళ్లాలంగావుంది
ఇరుకుగా మురికిగా బరువుగా
బరిదగా లంపడిగా నానా భ్రష్టంగానూవుంది.

మూడోతరగతి బోగీల సంఖ్య
మరింత పెంచుకుంటే తీరుతుందికదా సమస్య?
అనుకొని ఆలోచిస్తే మాత్రం
ఇక్కడ ఉపమా రుచి భంగం అవుతుంది.

మంచం కురచైతే
కాళ్లు నరుక్కోమని చెప్పే సలహాకూడాకాదు
కాని దేశాన్ని సాగదీయడం ఎవరితరమూకాదు
కనుకనే పరిష్కరించుకోవాలి మన తరంలోనే

మనం వినుకుంటే
ఆలోచనాపరులు చెప్పే సలహా ఒక్కటే;
యుక్తవయః పరిపాకం అందుకున్న
అమ్మాయిలూ అబ్బాయిలూ!
అవశ్యం వివాహం చేసుకోండి.

గడిచిపోయి పట్టుతప్పిన గతంలాగే
వస్తుందో రాదో స్పష్టంగా తెలీని ఆగతం కోసమై
కాలహరణం చేయకండి
హాయిగా అనుభవించండి
జీవిత మాధుర్యాన్ని, దాంపత్య గాంధర్వాన్ని
అనుభవసురభిళాన్ని, ఆహ్లాదమరందాన్ని...

ఐతే మీ ప్రేమోత్సవానికి
ఉత్సాహం కలిగించే ముద్దు పాపలు
తోకపోతే వ్యర్థంగా వెగటుగా కాళీగా బోళాగా
ఉంటుంది జీవితం.

కవకనే కనండి ఒకరో యిద్దరో
అందమైన పాపల్ని, ఆరోగ్యానికి ప్రతిరూపాల్ని
జీవిత తాపోపహరణాల్ని, ఆశాస్వరూపాల్ని ...

సంఖ్యా బలానికిగాదు మన సంతానం
గుణాభివృద్ధికే కదా మన సంకల్పం

ఊరికే అదేపనిగా కనేకండి పిల్లల్ని
కల్లల్దీ పిల్లల్దీ ఎలుకల్దీ రద్దీ
పెరిగితే ఎంత అరిష్టమో – వేరే చెప్పనక్కర్లేదు

సంఖ్యా బహుళ్యం
అన్నింటా వాంఛనీయం కాదు
అమావాస్య నాటి లక్ష నక్షత్రాలకన్న
పౌర్ణమినాటి ఒక్క చందమామ నయం

ఇది అందరికీ తెలిసిన సమస్య
ఐనా అందరం అవశ్యం తెలుసుకోవాల్సిన సమస్య!

మదిలో గదిలో హృదిలో పూపొదలో
పెళ్లాం పెనిమిటులు జాగ్రత్తగా
ఆలోచించుకోవలసిన సమస్య !
పువ్వు తనకోసమే తాను విరిసినా
లోకానికి సురభిళమిస్తుందని మరువకండి !

(25-5-1967 కాకినాడ ఫీల్డు పబ్లిసిటీవారి కవి సమ్మేళనంలో ఆసువుగా చెప్పినది).

(15-12-1967 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో).

చేతస్పర్శ

నీరవ నిశాగర్భంలో
తలదూర్చి వెలికి రాలేక
తన్నుకుంటోంది అడు జింక
నిజమే దానికి కొమ్ములుండవు !
అడ్డుకున్నదేమో తెలియదు

పైన గగనలతాకుడుంగంలో
విరిసిన విషలతాంతాలు
శతసహస్ర ఘోరాటవులైన తారావితానాలు
కీంద పుడమి – పుల్లవిరిగిన కడిమి
ఆశ నిరాశల కొండలూ లోయలూ
పొదరిళ్లూ బూమ్మరిళ్లూ నారుమళ్లూ వాలుకళ్లూ

పులులూ పాములూ జలగలూ కర్కాటకాలూ
దురాశల భిల్లుల కశాఘాతాలు
నిష్ఠురోక్తుల ధనుష్టంకారాలు
నీరవ నిశాగర్భం –
నేటి ధనస్వామ్య వ్యవస్థలాగుంది

తలదూరిచి వెలికిరా లేక తన్నుకుంటూన్న
అదు జింకలాగుంది మానవత !
తల్లడిల్లుతోంది తరుణశాబకం
ప్రకంపిస్తోంది తూటుపు చూలింత–
కడుపులోని ప్రత్యూషం !

(రచన 2–8–67)

(కృష్ణా పత్రిక 28–9–1967)

ఇది భయంకర కాళరాత్రి

వర్తమానం వంటి అమావాస్య
భూతల అపహాస్యంవంటి కటికచీకటి
మొగమంతా మశూచి కుండలు పోసిన రాత్రి
నఖశిఖ పర్యంతం నల్లని తారు పూసుకొన్న రాత్రి
"బాబోయి, నాన్నా – భయం వేస్తోంది!"

చీకటి తలుపర బోసుక నర్తిస్తోంది
రాకాసి ముఖాలవంటి చీకటి ముద్దలు చెట్లు
"ఏకాకిని అమ్మోనయి ! భయం వేస్తోంది !

కెరటాలతో కళ్ళాపెళలాడుతున్న యేరు
తన చప్పుళ్లకు తానే భయపడి ముడుచుకుపోతున్న యేరు
చీకటికి దడుసుకుని నిదరలో ములిగిపోయిన ఊరు
"బాబోయ్ ఇది భయంకర కాళరాత్రి .
అమ్మోనయ్ ఇది విలయంకర కరాళధాత్రి !"

పరిమళం విన్నా మృగ మదం వ్యాపించింది
సుస్వరం విన్నా మృదంగం ధ్వనించింది
ధరిత్రి నిండా తమాల వృక్షాల నిట్టూర్పులు

రాత్రి హృదయంలో దైన్యం పలవించే ఆర్తనాదాలు
ఏకాకి గుండెల్లో ఏకాంత భయానక నిశ్వాసాలు
సరుగు చెట్ల ఊసులు
శృగాలాల కేకలు
ఉగ్రాత్మల కప్పి లాగినట్లు కీచురాళ్ల చప్పుళ్లు
కొరపిడెయ్యాల పికటాట్ట హాసాలు
"బాబోయ్, నాన్నా, భయమేస్తోంది !"

అవతలి ఒడ్డున విడిసిన సిపాయి గుర్రాల సకిలింపులు
ఇవతలి ఒడ్డున ఒంటరి భీతివంటి అంతిమశ్వాసల ఇకిలింపులు
ప్రకృతి యావత్తూ పడివుంది మూర్ఛాగ్రస్తమై
పుడమి ప్రాణభయార్తమై చైతన్యం ఉడిగింది
కలికలిగా ఆకలి అలముకొంటోంది
కదలినగాలి గీపెడుతోంది; భయపెడుతోంది
మెదిలే ఎండుటాకుల సరీసృపాలు చుట్టపెడుతున్నాయి
"బాబోయ్! నాన్నా, వెనక్కి చూడలేను
అమ్మోనాయ్! మోసం ముందుకు నడవలేను!"

సర్వత్రా ధ్వాంతంలో మృత్యుజంఝు గుసగుసలాడుతోంది
ఆడుగులు పడుతున్న చిరుగరికల గుండెల్లో
కాలం బుసకొడుతోంది

తాడిచెట్లు యమకింకరులై జనపాలల్లా దిస్తున్నాయి
మేడి పండు విచ్చుకొని తక్షకుడెదురై లంఘిస్తున్నాడు
వేయపడగలెత్తి తోకపై నించున్నాడు;
అనలం క్రక్కుతున్నాడు
"బాబోయ్ నేను పరిక్షీతుడ కాను!
అమ్మోయ్ నేను పరీక్షిత్తునయ్యాను!"

నిద్రపోతున్న లోకంలో నేనొక్కణ్ణే ఎందుకు మేల్కొన్నాను?
ఉపద్రవాలిన్నింటికీ నేనొక్కణ్ణే ఎందుకు ఎర అవుతున్నాను?
ఇన్ని వేల శవాల మధ్య నేనొక్కడ్నే ఎందుకు మసలుతున్నాను?
ఇంత సాంద్రదరిద్ర తమస్సులో నేనొక్కణ్ణే
ఎందుకు బందీనయ్యాను?

ఈ చీకటి నల్లసిరాతో మరణశాసనం రాయలేను
చేపల సంతలా క్రిక్కిరిసి మూగిన మిత్రు నెదిరించలేను
దూరపు చీకటి పలకమీద మిణుగురుల హెచ్చరికలు
"ఇది డేంజర్ జోన్!" అని
కాని ఎందుకుపకరిస్తవి నా కవి?
గుండె నరాల దారాలతో లూతలు తెరలల్లుతున్నవి
"ఇది డేంజర్ జోన్!" అని, ఇప్పుడీ ఈగకి దిక్కేమిటి?

ప్రమాదాల అడకత్తెరల మధ్య ఇరుక్కున్నవాడికి
ప్రమోదాల స్మృతిపేటికలు ఏం మేలుచేస్తాయి !
కాలకూటాన్ని సుమమరందమన్న భ్రమలో
పూసుకున్నవానిని ఏ చింతామణి రక్షించగలదు !
"బాబోయ్, ఇంక సూర్యోదయ మవదా ఏమిటి !
అమ్మోనయ్ ఇంక ఆశాలేశం లోచదా ఏమిటి !"

(ప్రచురణ : 4-10-1964 విశాలాంధ్ర ఆదివారం సంచికలో)

మా - నవమంత్రం

మనం జాగరిద్దామిక
మనం ఉజ్వలిద్దామిక
నేడే మనమొక నవగీతం విరచిద్దాం
నేడే మనమొక నవమంత్రం జపియిద్దాం
ఇది రాకెట్ వేగంగా
ఎద తుఫాను రావంగా
వేగముగా
రాగముగా
జాగృత నవతేజముగా
కొత్తపాట విరచిద్దాం
కొత్తబాట నిర్మిద్దాం
జవం రవం కలిగిద్దాం
సత్వము చేకూరుద్దాం

వ్యోమతలములోనిండిన విప్లవ శంఖధ్వనిగా ...
వసుంధరకు నవశక్తిని ఘటియించే నాదముగా ...
కకుబంతము ప్రకంపించు విప్లవ శంఖధ్వనిగా ...
సోయధికొక నవతరంగ మొదవించే నాదముగా ...

మేఘగర్జుల తకధిమి
రాగ మర్దుల తధిగిణ.
వేగముగా ప్రేమగా
వేగముగా సాగగా
నిబిడీకృత అణుధాతువు
సృజనోత్సవ యాత్ర ప్రకృతువు.
తొందరగా
సందడిగా
దారిలోని ముసలి చెట్లు
చిందర వందర చేస్తూ

మహావటం అశ్వత్థం వయోవృద్ధ-సాలార్జున సంకీర్ణం
జంఘాలం కాకోలం కీకారణ్యాక్రమణం
జగమంతా కాంతారం
మునుముందుల కనులముందు
కాంతారం జగమంతా !

జగం – ఉలూకోద్ధారం
జగం – వృకం, కృకలాసం
సృగాలాల శృంగారం
కాకోదర అంగారం
సకల కల్మషాకీర్ణం

చిందర వందర చేయక
సందడిగా... తొందరగా
లేచి రండి ! నవచింతుల
పిచరండి ! నవఘోషల...

అడుగు పొరల వరులంతా
ముదకరులై... నవయురులై
చీల్చరండి, కాల్చరండి!
తలాతలం... రసాతలం... పాతాళం
చీల్చిరండి వరులంతా

లేచిరండి వైశ్వానర
దీప్తులుగా కీలలుగా
తెర్చుకొండి నిగళాలను
ధనస్వామ్య కృతకాద్రుల
స్వార్థ పర్వతాగ్రాలను
పేల్చిరండి !... డైనమెట్లు!

భేతాళుని ఇంద్రజాల శక్తులు చేపట్టిరండి
వీరసింహులై నేడే విక్రమార్కులై నేడే
త్వరగా మనమొక నవలోకం సృష్టిద్దాం
త్వరగా మనమొక నవనాకం నిర్మిద్దాం

(ప్రచురణ : విశాలాంధ్ర 25-7-1965)

చంద్రునిపై చేపల్ పట్టి శపిస్తున్నాను

వెన్నెల కెరటాల తళతళల లోనేటిలో
శిలరాశి పావంచాల నలవోకగా
సుతారంగా శోభగా హేలగా దిగి
జలక్రీడ లాడుకోవాలన్న కుతూహలం
కలగడంలేదు; కలల రగడ నేడు పరిపడదూ

హాయిగా లోకోక్తులా తమిదీరా జేపించి
సుందర నారీ చేలాంచ లాచ్ఛాదనలో
పంకాకింద పవళించి మైకంలో కనులరజార్చి
జో కాషియోను పఠించాలనీ భయ్యాములో
సయ్యాటలాడాలనీ మనసువిచ్చలరడంలేదు;
ఏలనె లోలాక్షీ – మృగమద పటీర మలదవద్దు !

పంచకళ్యాణి అరబీ తురంగాన్నధిరోహించి
సప్తసాగరాల కావలి గులేబకావళి కోసం
మనోరమా పల్లవ పాణిగ్రహణం కోసం
కథానాయకని వ్యధా హృదయ బంభరమై
స్వైరమాణ సమీరణ తరంగమ సన్నిభమై
కదం త్రొక్కాలని లేదు; క్రొక్కారు మెరుపులవలె
చెంగలించాలని లేదు;

చంద్రుని వక్షంపై చేర్వాలుచేసిన ఈ అర్ధరాత్రి
ప్రమాణంచేసి చెబుతున్నాను; చేస్తున్నాశపథం!
సకల జగజ్జనతాహృత్ కమలాకర సన్నిధిలో
మానవీయ రనజ్ఞతా వివేచనా చేతనతో
దంభోళీ కంఠగళిత ప్రతిజ్ఞ స్వీకరిస్తున్నాను!

శత్రుఘ్నుడనై విలంఘిస్తున్నానీ అంధరాత్రి...
సవ్యసాచిగా విజృంభిస్తున్నానీ సమరధాత్రి...

విశ్వజనాళిపై ఉరకలిడిన జిఘాంసా రక్త పిపాసల
నొక్క వియత్నామ్‌పై కేంద్రీకరించిన జాన్సన్
ప్రజాభ్యుదయ నిశ్రేణిక కూల్చాలన్న కక్షతో
ఆశియా గుండెల్ని ద్రవ్యలొనరిస్తున్న కేన్సర్!
నా ముందు బందీయై ముకుళితహస్తుడై నిల్చున్నాడు నేడు
నేనే ప్రాసిక్యూటర్‌నై జడ్జీనై విచారణ సల్పుతున్నాను నేడు.
నరహంతక దారుణ మారణ నేరం
ఆరోపిస్తున్నాను, శపిస్తున్నాను, శిక్షిస్తున్నాను.
"ఓరీ నరరక్త పిపాసీ జాన్సన్!
వియత్నామ్ వీర ప్రజానీకాన్ని – నాకాన్ని
సంక్షుభిత నరక మొనర్చిన పాపిష్టి!
భ్రూణ హత్య లొనరించిన ఫాసిస్టూ!"

ప్రజల గద్దెమీద – బలివితర్ది మీద– నీ దిష్టిబొమ్మను
ఊరితీస్తున్నాను, దహనం చేస్తున్నాను,
ఖననం చేస్తున్నాను!
నరజాతి అవివర్గంపై
తిరుగులేని జరిమానా విధిస్తున్నాను

నీ పాతకాలబండి నిండిందిరా, ఇక నడవదు
బోల్తా పడిందిరా; ఫెళఫెళ విరిగిందదిగో!

నా కనుదెప్పలలో మిస్సితాల జాజిపూలు
కుట్టుకోవాలని లేదివేళ; బాలారక్తరోచిర్నవహాల
సాంద్ర సురభిళ పారిజాతాల నీస్సితాల గుండెలోని
కేరుకోవాలని లేదివేళ; భామినీ
హసన్మందారకపోలాల
నా అధరాల కతికించుకోవాలన్న కోరిక
సుతరామూ లేదివేళ;
సురాపగార హాస్తీరఫుల్లిన స్థలిలో
ఊర్వసీ పీనోరః కేలిత కంచుకంలో
ప్రేమగీతికా పత్రగుళుచ్ఛాన్ని లగించాలన్న
వాంఛ లేదు;
నిబిడ హేమాస్తీకై శిశోధ్వాంతయామినిలో

చంద్రుడిపై చేరుకుని శపిస్తున్నాను —— 27 —— సోమసుందర్

కవితా ప్రియంవద కాంతిమతి కోసం తమోభిసరణం
చేయాలన్న కాంక్ష ఆవంతయినా లేదు;
శృంగారలహరీ
అభిసేచనాభిలాష బొత్తిగా సయించడంలేదు!

నిజం చెబుతున్నాను నమ్మండి
భయరహితంగా దయాసహితంగా
నిబ్బరంగా నిజం చెబుతున్నాను విశ్వసించండి!
చూడండి పొంగుతోంది నా డెందంనిండా కక్ష
జనతాశత్రులపై పగ తీర్చుకోవాలన్న
దొక్కటే ఆకాంక్ష!
కవికుల గురువు వాల్మీకికి వారసుడనై
కవితా మానవతా మంత్రజలం చల్లి
నరహంతల రణదానవుల శపిస్తున్నాను నేడే!

(ప్రచురణ : 31-7-1966 విశాలాంధ్ర)

జ్ఞాతకాల్పత్రయి

క్తాలం :

క్రకచం వలె ర్మింగింది

మకరం వలె ర్మింగింది

ఫణంవలె బుసకొట్టింది

ర్వణం వలె విషమించింది

సంకటం వలె పీడించింది

కంటకం వలె బాధించింది

కాలం :

కాంతి వలె జృంభిస్తోంది

క్రాంతి వలె లంఘిస్తోంది

ఉద్యమం వలె సంఘటిస్తోంది

ఉదయం వలె సంచలిస్తోంది

విప్రయోగం వలె భ్రమిస్తోంది

విప్లవోత్పనం వలె రమిస్తోంది

కాలం :

ప్రవక్త వలె భాసిస్తుంది

సవిత వలె జ్వలిస్తుంది

పీయూషం వలె పొంగుతుంది
మయూరం వలె నర్తిస్తుంది
అధరం వలె చుంబిస్తుంది
ప్రసవం వలె బింబిస్తుంది

1. కాలం సంతకాలు

హృదయంలో వస్త్రోత్పాలిత మయ్యే
భావాల హరిద్రంతో సరస్వతి పాదాలకు
పారాణి పచరింపబడుతుంది

కనుకనే కవిత్వం యుగాది నుంచీ మనిషికి
హార్దిక యావనాన్ని కాపాడే కాయకల్పచికిత్స
కనుకనే కవిత్వం క్షణంలో మనిషిని
పరకాయ ప్రవేశం చేయించే
అణిమాది దివ్యమంత్రం!

మనోహర ప్రత్యూషానిల వీచికల తాకిడికి
మనోయవనికాభ్యంతరాన
వడివడిగా కదలి పోతూన్న
వేవో రంగురంగుల కలనేత చిత్రాలు
కలధౌత మూర్తుల భంగిమలు...

అల్పాల్పంగా సాగుతూన్న సరస్సుందర తరంగాలు
స్వచ్ఛ ఆనంద్రకేంకార శుభ్రమరాళాలు
విలోకిత జలదమూలాతృషిత మయూరాలు
మహోధర శిఖరాలలో నిలచిన వృక్షాగ్రాలలో
వసంతకాలం - చేస్తూనే ఉంటుంది సంతకాలు !
శీతలించిన మబ్బులు ఆవలిస్తే
ధారాపాతంగా మంచు తుంపరలు

అనిరళంగా కదిలే మనస్ చాలసీలో
పైకి పొల్లూ క్రిందికి నెల్లూ...
ఇవి అనంతంగా సాగే చీకటిని మింగే
వెలుతురు చిరునవ్వులు...
మానవతాధీరకృత్యాలు !!

2. కాలాగ్ని కిందనాలు :

దివారాత్రాలు సూర్యుడనే రూపాయి బిళ్ల ఒళ్లుకి
ముఖమూ పృచ్ఛమూను...
పగటి జీవితాన్ని ధనం పాలిస్తే
మాపటి జీవితాన్ని పాలించేది కామం

త్యాగిరాజీయానికి జ్వలించే శక్తివుంది
కాల్చేశక్తివుంది; మండించే శక్తివుంది
కరిగి నీరయిపోయే శక్తివుంది చిత్రం!

కాలం త్యాగిరాజీయం వంటిది
కాలుస్తుంది, కరగి కారిపోతుంది
ఇంతలో చింతలా కాలి భస్మమైపోతుంది.

ఇంత వేగీయ మానంగా నడుస్తున్న కాలం
వంకర టింకర్లుగానో, సమాంతరంగానో
లేక అనంతవర్తులాకారంగానో
మనిషి కెప్పటికీ తీరని సందేహమే!

ఒక మహత్తు మరణించడానికీ
వేరొక మహిమాన్వీత జనించడానికీ
మధ్య పడినగండి – అదే కాలాఖాతం
దేనితో పూరించబడుతుందో సంశయమే!

కాలం తారుణ్యవృద్ధుడు ప్రపంచించే
చలిమంటల నగ్నల్లో
ధనమూ కామమూ ఇంధనాలు!

3. కాలమే నిర్ణేత

కొలం సువిశాల వాతాయనం లోంచి
అనవతరమూ వినవస్తున్నాయి
అనంత కావ్యాల మర్మరధ్వనులూ

స్వర్గంగా తీరాల సికతాతిలాల దారులలో
నిరవధిక శాద్వల సీమలలో
పల్లవిస్తున్నాయి నిరామయ కామనలు

కవి భావనాకాశ నిర్ఝరిణీ తరంగం
కోమల నీరవ మృదురవాలు
సుధా తుషారాల నొలికిస్తూన్న దజస్రం

ప్రణయకల్లోలినీ తరంగాల తేలిన
రసహృదయాలు అనంత తారకలై
వికసిస్తున్నాయి కోరకిత్సున కోరికలై !

మానస చింతా చింతనలమేయ బలోపేతాలు
మానసీయ గతానేక స్మృతులు విడువని ప్రపంచాలు
మానవక్షమా దమాదులు కేవల దైవీభూతాలు

ఊర్వరీ ఉరస్సీమా నిక్షిప్త సకల సౌందర్యాలపైన
శర్వరీ తమచ్ఛాయ లతివేలంగా జృంభించి
కప్పుతాయి క్షితిజరేఖల మేఖలపైన...

ఆగొన్న కాలవ్యాలంవలె ఉగికి వస్తూన్న దిగంత తిమిరం
బాలచంద్ర శార్జ శరత్కరీఖండం
పురోగమిస్తుంది శరఘోషతో.

చిరంతన పథిశ్రమా జీవనులైన మహిమాన్వితులు
మహోపదేశ శ్వానాలతో దత్తాత్రేయ శ్రీపాదులై
ఘనీభూత కాలగర్భంలోంచి —
సాక్షాత్కరిస్తూనే వుంటారు అమృత జీవనులై !

ధరిత్రీ వర్చస్సౌందర్యాన్ని చెరిపేందుకు
దారుణ్యం నిర్మించిన పాషాణభరకుడ్యాలలో సైతం
సౌజన్యం విరుస్తుంది పహ్లాస జీవనసుమాలై !

తరతరాల పాపాల సోపానాలతో నిశ్రేణిని
నిర్మించుకొని ఎగబ్రాకుతోంది మానవత !

రచన : 1967

(ప్రచురణ : భారతి మార్చి 1968)

ఉగ్గాటవి

వనిత సరుకువంటి సౌందర్యం
ముస్తాబయి నిలబడింది బజారులో
ఉరోజయుగం కలుగులోంచి
బుభుక్షోరగం పడగెత్తి అదుతోంది

అన్యాయం తాలింఖానాలో
వ్యాయామం చేస్తోంది న్యాయం
గానం కదుపు గడవక
పణంగా పెదుతోంది మానం

బాధలతో నిండిన బ్రబతుకు
వానలో తడిసిన గొంగళీ పురుగులా
భారంగా నడుస్తోంది!
పొంగిన నురుగు
పరిమాతీత పదార్థంగా సాక్షాత్కరిస్తోంది

నా జాతి స్వప్నాలు
పరిపక్వ కాకుండా
చిట్లిపోయిన పక్షిగ్రుడ్లు!...
ప్రగతి పథంనిండా పరపీడకులు
పరచిన పీడకలల నీడలు

ద్యూత వ్యసనంలో చిక్కుకున్న
నేటి ప్రజా పాలకుడ్ని
అధికార వ్యామోహా
కరోకుటకుడు కాటు వేశాడు!

రూపుచెడి
పచ్చిభౌతిక వాదంలా
వికారంగా మిగిలి
దురాశా వ్యాఘ్ర వ్యాళగండ భేరుండ
నిరంతరోగ్రాటవీ వ్యగ్రుడై
త్యాగాల పూర్వసువాసనల్ని
పరిహారం చేస్తున్నాడు —
స్వలోభ గ్రస్తుడైన బాహుకుడు!

(రచన : ఆగష్టు 17న)

(ప్రచురణ : 1967 నవంబరు, భారతిలో)

మహా మహిమాన్విత

రండి రండి మహాజనులారా – త్వరపడండి
మిమ్మల్నందర్నీ అద్దరిగట్టుకు చేరుస్తాను రండి
మీ కోసమే తెచ్చాను, ఇది "సమధర్మం" అనే లాంచీ –
ఇదే ఆధునిక మానవుల నిస్స్వార్థ ఆదర్శాల పంచీ !

ఇద్దరిని అంతా చీకటి,
ఇంటా బైటా చీకటి, గుండెల్లో గుడిసెల్లో
గుడిలో మడిలో కావడిలో పెంజీకటి,
ఆశలకీ ఆశయాలకీ మధ్యగల అంతరాల్లో –
ఆలోచనకీ ఆచరణకీ నడుమపడిన నీడల్లో –
తండ్రికీ కొడుక్కీ మధ్య తెరచుకొన్న అఖాతాల్లో –
పెనిమిటికీ పెళ్లానికీ నడుమ పొడసూపిన
పేమల అవాంతరాల్లో –
పొదుపుకీ దూబరాకీ మధ్యస్థంగా లేచిన
నిత్యావసరాల పాము పడగలలో –
గళ్లా పెట్టెలకు బ్యారల్లా బలిసిన పొట్టల్లో –
పెళ్లాం బిడ్డల ఆకలితీరక అంటుకు పోతున్న కడుపుల్లో
సర్వత్రా అట్టహాసంచేసే చీకటి, చీకటి !
గర్వాంధ మహోంజనంలా అలముకొంటున్న రాకాసి చీకటి!

అద్దిని – వేవెలుగురేకల కొత్త మతాబుల
జలతారు వెలుతురు, కలధౌతచ్ఛవుల గుచ్ఛాలు,
దుర్దిన సమూహాల తదనంతరం ఉదయించే
అరుణోదయంవంటి రమణీయకాంతి పుంజాలు,
సంతతం ప్రకాశిస్తాయి సర్వత్రా !

పినిర్మక్త జలదజాల వియన్మధ్యాంతరాన
అంగారక సహితుడైన అరుణార్కుని కైవడి
అసామాన్యంగా ప్రభాసిస్తాడు సామాన్య మానవుడే !

కృతకాద్రులు, చెంగలువ కొలనులూ
హరిత శాద్వలసీమలూ, కోమలకుసుమప్త బకాలూ
అప్రయత్నంగా అవ్యాజంగా అంతటా లభిస్తాయి,

చేయగలిగినంతేపని !
కావలసినంతా సుఖం !
మనిషిని చూస్తే మనిషికి లేదక్కడ భయం
మనిషిని మనిషే పీల్చుకు తినే మత్స్యన్యాయం
లేదక్కడ అరణ్యక "ధర్మం"
అక్కడ మంత్రులూ సామంతులూ మంచినీళ్లే త్రాగుతారు.

లంచగొండి దుస్సాలగుండులు
కారాగారంవంటి ప్రదర్శన శాలల్లోనే కనిపిస్తాయి
ఇళ్లకి తాళాలు బిగించ నక్కర లేకుండానే
ఆరుబయట హాయిగా అందరూ నిద్రపోవచ్చు
ప్రతివారి మోవీ ఆనందాన్ని చుంబిస్తుంది
ప్రతివారి జీవీ శరచ్చంద్రికాలోకంలో
వాహ్యాళిగా విహరిస్తుంది వినోదకేళిగా !

ఇద్దరిని కంట్రాక్టర్ల ట్రాక్టర్లు
లంచాల అదనపు లాభాల మాగాణీలను
దమ్ము పడుతుంటాయి నిత్యం
సాలుకు రెండు పంటలూ అవిచ్ఛిన్నంగా
మాసూలు చేస్తూంటాయి,
ప్రచ్ఛన్న వేషాలలోని పరోక్ష భూకామందులకు
పాపాల నూర్పిడిలో సాబాలు పంచిపెడుతుంటాయి

కంట్రాక్టర్లు కట్టిన భవనాలు
బిల్లులు ప్యాసు చేయించుకొన్న
మూడవనెల మూఢాడ కుండానే –
గృహప్రవేశ మహోత్సవాల బాదరబందీల
అనవసర హంగామాల దుర్వ్యయం పాల్పడ కుండానే –
ఆకాశం ఉరమడం చూసిన మంచి ముహూర్తంలో
గుభిల్లుమంటూ ఒక్కపెట్టున కూలిపోతాయి !

అద్దరిగట్టున మున్నూటరువది దినాలు
శుద్ధ సావేరి రాగాలాపనమే వినిపిస్తుంది
విశుద్ధ జనహృదయోత్సవాల వసంతయామినులు
విరుస్తాయి; సంతృప్తి సంతోషాల హసంతీ సీమంతినులు
సర్దుస్తాయి; నిర్మలకాసార తటాల నారికేళాట
స్నాత సుందరులై ముచ్చట గొల్పుతాయి !

అక్కడ ప్రతివారి పాన్‌దాన్‌లోనూ
కస్తూరీ కుంకుమ పూవూ పచ్చకర్పూరం,
ప్రతివారి దేహానికి చందన చర్చల పరిమళం
పునుగూ జవ్వాదీ అతి సామాన్యం
వేయేల మహాభాగులారా, వేంచేయండి
మృగమద కుంకుమ ఘనసార సంకుమద హిమాంబు
కాలాగురు గంధసార ప్రభృతి సుగంధ ద్రవ్యంబు
లోహగిసాహరిగా అక్కడ లభిస్తాయి అవధరించండి !

అక్కడ కర్పూర హారములేగాని నిట్టూర్పులు లేవ్
అశ్రుకణాలతో ఆవులించే అనదల వాకిళ్లుండవు
నిరాశా నిస్పృహల ఊబినేలల దొంగదేవులు లేవు
దురాశాహంకారాల కొండచిలువలు చుట్టలేవు
జమిలిగా మంచిచెడ్డలు క్షీరోదక న్యాయంగా
కలసిపోవు ! అక్కడ ఆశ మందికి శిరస్త్రాణం
మంచి ప్రతివారి ముఖ వర్చస్సుకో లక్షణం !

యుడత పేచీల ఖసుర సంధ్యలూ
లెట్టిగేషను కోర్టుపక్షుల కలవరాలూ
నిర్దాక్షిణ్యంగా నిషేధించబడ్డాయి
ప్రపంబమూన ద్వేషానల ధూళిరేగదు
పెర్మిట్ల విషమ ఋతుపవనాలు వీచవు
ఇలా ఏంతని వర్ణించగలను మిత్రులారా !
ఇలాతలాన సాక్షాత్తూ మొలిచిన స్వర్గమంటే
సరిపోదంటారా ?...

ఉన్నపత్యాన్ని నగ్నతతో మనవిచేశాను
ఉన్నవీ లేనివీ కలిపి ఊకదంపుడుగా
అతిశయోక్తుల స్థలపురాణం విప్పడంలేదు;
హుళక్కి మంత్రాల ఆకాశ పంచాంగం వినిపించడంలేదు.
ప్రజల జలధరధ్వాన గంభీరరవంతో
చేసేమి మహోపన్యాసం దంచడంలేదు.
రండి, రండి, త్వరపడండి !

ఉన్నపళంగా హుటాహుటీగా ఎక్కేయండి లాంచీ
ఇక్కడే విడిచిపెట్టండి ప్రారబ్ధసంచితార్థాల
దుఃఖాశువ్యులదీనగాథలసంచీ!
"తక్కువ సామానుతో ప్రయాణం
ఎక్కువ సుఖదాయకం !"
అనే సూక్తిని మరువకండి; విముక్తి పథాన్ని విడువకండి !

"జీవయాత్ర - చేదుమాత్ర!"
అనుకుంటూ నిరాశలో మునిగిపోకండి
కాలహరణ మేల రారండి; మోదంజేయండి!
మీరు జీవితాంతం ప్రేమించి చిరపరిచయాన్నులో
తపించి పోతున్న ప్రేయసి! భవిష్యత్సుందరీ ప్రియంవద.
అక్కడే మీకోసం హారతిపళ్లెంతో
ఆనంద దామంతో ఆహ్లాద వదనంతో
నిరీక్షిస్తూన్నది; అలస్యానికి శపిస్తూన్నది.
హాసికోత్పల శతపత్ర మోహిని ఆమె;
సహజీవన చిత్రచ్ఛాయా సుఖాసీన;
చిరంజీవి సౌభాగ్యవతి శాంతిలలామ.
సమధర్మ జ్యోత్స్నాపులకిత చారుగాత్రి!
త్వరపడండి మహాజనులారా, రండి. రండి!
అందరినీ అద్దరిగట్టుకు చేరుస్తాను రండి!!

(ప్రచురణ: విశాలాంధ్ర; 16-6-1963)

స్వప్నించకు...

జిగమూడే చదరంగపు గదులలోన
ఓ జీవిత మొక పావు
ఖగేష్టాచానుగ్యం అలవడితే
బతుకులోన భాషలుకనిపించవు
గొప్పవాళ్ళ ప్రసంగాల ఉదారాశయాలెన్నో
ఉదరపోషణావసరాలు తీర్చవు
థర్డ్‌క్లాసు బోగీలో నరులున్నా దొరలున్నా
బిచ్చగాళ్ళ అరుపులింక తరగవు
స్వప్నించకు సువర్ణించే సమాజ సౌఖ్యాలకొరకు
కలలెన్నడు వాస్తవాలు కావు!

కలలు కలచు ... వలపు మలచు ... తలపు ప్రేచ్ఛనకుని
పన్నగాల బారిపడిన దరిద్ర నారాయణుని

గోవుల వధనిషేధించ గోలపెట్టి దిగంబర సన్యాసులు
నరుల వధించారునిన్న ప్రశూలాలు గ్రుచ్చి
మలయ మారుతాలకొరకు కలలకనకు చెలుములకై
ఖలుల విలయతాండవమునకీ జగత్తు వేదిక
స్వప్నించకు స్వప్నించకు శోభామయ నాకములకై
లుబ్ధ దురాశాగ్నికీల వసుమతి విడిపోదిక!

(రచన : 7_7_67 ప్రొద్దూర్లో) (12_8_67 కృష్ణా పత్రిక)

రుద్రనేత్రం తెరుస్తా నీ రాత్రి

దయచేసి ఈ రాత్రికి నన్నెవరూ పలకరించకండి
కదన కుతూహలరాగాయత్తంగా స్వరమేళనచేసి
లగించి బగించిన విపంచిక నా హృదయం
కించిత్సమీరణ ప్రసరణకు సైతం
పర్వతంత్రిలా ఘులకించి పలికించి
మూర్ఛనలు పోయేందుకు సంసిద్ధంగా ఉన్నది.
దయచేసి నన్నేకాంతంగా విడువండి
నాలోంచి నేడొక నవవ్యక్తి ఆవిర్భవించనున్నాడు
ఆత్మవంచనను సంయమంగా భ్రమించిన
నిన్నటివాడు కాడాతడు;
లోకవంచనకులోబడి భూమికగా
ఆత్మవంచనను ఆరాధించిన
అసహాయ శూరుడు కాడాతడు
అధికార బధిరాంధకుల విషోచ్ఛ్వాస నిశ్శ్వాసాలకడ్డి
ళీరువుగా మారిన వదరుబోతు సదానందుడు కాడాతడు
దయచేసి ఈ రాత్రికి నన్నెవ్వరూ పలకరించకండి

నరుల ఫాలతలాల పొలాలలో
కష్టాల దుష్టగ్రహాల్ని పండించుతున్న
ఆ పోరంబోకెవడో పరిశోధించి హతమారుస్తా నీ రాత్రి
నన్నెవరూ ఆపలేరు; అనునయించలేరు
అనుసరించలేరు, అనురోధించలేరు.
జ్వాలత్ జ్వాలా జిహ్వాగ్రాల హుతాశనుణ్ణోరాత్రి
వద్దు వద్దు ఎవరూ నా దరికి చేరకండి
నన్ను తాకకండి, కదిలించకండి
సాంత్వన వచనాల గాలిపీచకండి

నాలలాటలిఖితం పద్యం
చతుష్పాదియై ఘోంకరిస్తోంది
తోకనెత్తుక విటపీపథాల పరుగులు తీస్తోంది
గరళాల నురుగలు క్రక్కుతోంది
హిప్పోపొటమస్‌లా బైసన్‌లాగ
రీనోసిరస్‌లాగ కక్షకట్టి గంతులు వేస్తోంది

మూలికంగా చచ్చి చైతన్యంపుచ్చి
భౌతికంగా బ్రతుకుతున్న ఒకానొక
ఇనప చట్రంవంటి పదార్థాన్ని మనం
సమాజమని పిలుస్తున్నాము

అది కదలదు పలకదు మాటాడదు
దాని హృదయం ఘనీభవించిన అయోమయం
రుతించడంలేదు; అనుశ్రుతించడంలేదు
మనిషి మెదడు దట్టించడంలేదు

ఏదీ నేటిరాత్రి ఒక్క దీపమైనా కనిపించదు
ఏదీ నేటిరాత్రి ఒక్క గీతమైనా కనికరించదు
కవిత వరించదు; భవితకుతరించదు
సవిత సాహిత్యకరించదు.

జీవితానికి మారుపేరు ప్రేమ అనుకొని
భ్రమించాను నేనిన్నాళ్లూ
సమాజ గమనానికి ఆశ చోదకశక్తి అనుకొని
భ్రమించాను నేనిన్నాళ్లూ
ఇన్నాళ్లూ కన్నకలల్ని తిరగేసి తొడుక్కుంటున్నా నీరాత్రి

ఒకానొకనాడు నేనే కన్నకలలు
కుబుసం పీడిచి బుసకొడుతున్న వీ రాత్రి
నేను కన్నకలలు కొన్ని నిర్మల కాసారాలు
– తన్మధ్యంలో దాగిన మొసళ్లు
నేను కన్నకలలు కొన్ని నిదురించిన సముద్రాలు
– తన్మధ్యంలో తిరిగే తిమింగలాలు

కాంతార మధ్య కాసార జలాలలో విహరించే
బంటఅంచల ప్రణయ క్రీడా సముత్సాహ కేంకారాలు
నా కలలన్నీ విలపించి మరణించి శ్మశానాలలో
కొరవి దెయ్యాలుగా అఘోరిస్తున్న వీ రాత్రి !
కనుకనే పాతికేళ్లుగా రాసిన కవిత్వాన్ని
తలక్రిందులుగా చదువుకొంటున్నా నీ రాత్రి !

ఈ రాత్రి సప్తసముద్ర తీరాలలోనూ
పీతలు అతిథోలాహలంగా పెళ్లిళ్లు చేసుకుంటున్నా
సృగాలాలు మృగమదాన్ని పూసుకుంటున్నా
ఏదుపందులు మంచిగంధం పులుముకుంటున్నా
ఈ చైత్ర మాసపుటర్ధరాత్రిలో మన్మథుడు
శతసహస్ర మకరధ్వజాల రెపరెపలాడిస్తూ
బోతిల్ని మోదికి దండయాత్ర సాగిస్తున్నా
నా హృదయం ద్రవించడంలేదు
నా మనసు రమించడంలేదు

తూర్పు తీర భూములలో
పురిడించిన సజీవ అరుణోదయం
నేలపై సంచరిస్తున్న కర్మ క్షేత్రాలలో
చుక్కలూ చారలూగల బెబ్బులులుచేసి

శాంత్యుపన్యాసాలు వల్లిస్తున్నా
వియత్నాం ప్రజాసమూహాల కమెరికన్
నాగరికతా ప్రచారకులు హాలాహలాన్ని విందుచేస్తున్నా
నా మనసుకేమాత్రం పట్టడంలేదు
నా మెదడుప్రదేశాలు పేనడంలేదు

కొరియా ఉరోజాల పరపర తెగనరకబడిన నాటిబాధ
కూ్యబాపై కేనిబాల్ దండులు మిడిసిపడిన నాటిగాథ
సిరియాలో పెల్లుబికిన ఆక్రందన
లావోస్‌లో భుగభుగ పొగలెగజిమ్మిన హాహాకారం
కాంగోలో హతవీరుల గోరీల్లో
లక్షలాదిగా రాలిన ఎర్రని పూరేకుల జాలిపాట
నా ఎదలో ఒకేఒక్క వీట్‌నామ్ ఊపిరిగా
గెరిల్లాల నినాదంగా నిస్వనిస్తోందీరాత్రి !
నిర్ఘుర్రిస్తోంది ! ఘుర్‌ఘురిస్తోంది !!

హేనోయ్ జనరల్ హాస్పిటళ్లపై
జాన్సన్ బాంబులు కురిపించినప్పుడు
రేపో మాపో ప్రసవించనున్న నిండు చూలాలు
గర్భం విచ్ఛిన్నమై బాలెంత విగతప్రాణియై
నెత్తురు మడుగులో అలమటిస్తున్న

నకనకలాడుతున్న ప్రాణమున్న శిశువు తుదిలోదన...
బాగీయా నగర వీధులలో
దిక్కులేని లేవలేని వికలాంగుల
ఆగొన్న గుండెలలో మూలుగుతూన్న శాపాలు
నాకు విస్పష్టంగా వినిపిస్తున్న వీ రాత్రి
నాలోని కోపం ప్రళయరుద్రుని
విరూపాక్షంగా ప్రజ్వలిస్తున్న దీ రాత్రి
వీరభద్రుని జటా జూటాట వీ జనిత
విలయజ్వాలా తోరణమై దహించుతూన్న దీ రాత్రి

ఈ రాత్రికి నన్నెవ్వరూ పలకరించకండి
నేనీరాత్రి ఎక్కుపెట్టిన గాండీవాన్ని
పూరించిన వాజేయ దుందుభిని
నొక్కబడుతున్న ట్రిగ్గర్‌ని
పేలబోతున్న డైనమైట్‌ని
వద్దువద్దు నాదరికి రాకండి !
నారిని మీటకండి; జానకి తాడు ముట్టించకండి .

వర్తమానంలోని ప్రతీక్షణం నన్నధిక్షేపిస్తోంది !
వసుమతీ హృదయంలోని ప్రతీకణం
నన్నవమానిస్తోంది.

కనుకనే ఈ రాత్రికి
నా కవితకు చేకూరడంలేదు స్ఫూర్తి
ఘనీభవించి శ్వాస నిల్పుతూన్నది
ఇక ఆగిపోలేను, నాగళముని౦డా ఒక్కటే ఆర్తి
విచ్చలవిడిగా సంచలిస్తున్నది కక్ష...
రచ్చకెక్కకపోతే నరునికి లేదు రక్ష !

ఈ రాత్రికి కె౦దమ్మి రేకుల మాలిక
లలంకరించ నీయండి !
ఈ రాత్రికి నన్నెవరూ పలకరించకండి ! కదల్చకండి !!

(పరిచురణ : విశాలాంధ్ర, 25-7-1965)

అభినేత్రి ఆత్మహత్య

నాటకం పూర్తయింది
ప్రేక్షకులంతా లేచారు
అంతనరకూ వింజామరలైన
రక్షకభటుల టోపీలు తలకెక్కాయి
అందమో బయటకు నడచారు

సుఖాంతమో దుఃఖాంతమో
అన్న తర్జన భర్జనలు జరుగుతున్నాయి
తెరలోపల కలకలం
అమధ్య మమతతో
మరులలో చిక్కుకొన్న అభినేత్రి
అయ్యోయో పాల్పడిందట ఆత్మహత్యకు !

విషంతాగి పాపం చచ్చిపోయింది
చషకంలో మిగిలే ఉన్నాయి చివరిచుక్కలు
ఎండిన్ అన్నారు ... ఐడిన్ అన్నారు ...

ఏమైనా అపదార్థం నాటకానికెందుకొచ్చిందో
దానికి టిక్కెట్లెవరమ్మ్నాగో
మేధాశాఖ ప్రకటించలేదు.

అభిజ్ఞవర్గాలు అత్యంత శ్రద్ధాళువులై
పరిశోధన చేయగా తేలిన రహస్యం –
అభినేత్రి అసలు పేరు – శాంతి అని!

(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 25–10–1968)

ఎలిజీ కాదు ఎపాలజీ

ఇది కవిత్వంకాదు భగవన్ – మమ్మల్ని క్షమించు ...
"పదిలంకాని" ఊహల్ని బట్వాడాచేస్తున్న కాగితం పడవ
పది కాలాలపాటు నిలవని అరిపేదభావాలు
తొక్కిపట్టలాడే నడవ
ఎదలో తోడుకొనని ఆలోచనల నంగడికిపంపే పెరుగు కడవ
ఇది కవిత్వంకాదు భగవన్ ! ఎలాగో మమ్మల్ని క్షమించు.

ధూర్తస్వభావాల, పదబిత్తాల అభావాల,
ఉపమారూప కావ్యలంకారాల
వర్తమాన లోకంపై కించితోకపంకాప్త చిరాకుల
కారాల మిరియాల అరిగీలరగని ఆలోచనల
సిద్ధాంతాల మషీరసంలో మర్దించి
కరిగీకరగని వర్ణాల భాష్పవారిలో రంగరించి
ఏదేదో వ్రాస్తున్నాం కూ (రు) స్తున్నాం
భగవన్–కనికరించు
చెబుతున్నాను పదేపదే ఇది కవిత్వంకాదు క్షమించు.

సనాతన సంప్రదాయాన్ని భరించలేక, నవ్యత సృజించలేక
చిరంతనంగా స్మృతివీధిమెరిసే భావతరంగాల రచించలేక
నవమానవీయతను మానసీయ
కవితాంబరంలో "వస్త్రకాళితం" చేయలేక

భవిష్యద్భవనానికి రసవత్
కవితావాతాయనాల కల్పించలేక
ఏదో వ్రాస్తున్నాం ఇది కవిత్వం కాకపోయినా ఫరవాలేదు
అమాయకులం దయామయా, హే భగవన్! మమ్ము క్షమించు

నిరాశానిదాఘ తప్త హృదయాలకు అందమైన సీసాలతో
చల్లని మధురసమందించలేక —
దురాశా శిఖరాగ్రాలపై మిడికే వాళ్లమీదికి
కార్దూలకంఠాలతో గర్జించి
లంఘించి దిగుడుబావుల ఊటలోకి క్రోసెయ్యలేక
పతితుల లేవనెత్తి చంపకమాలా సుగంధ సమీరాలవీచి
పరాన్నభుక్కుల మత్తేభాలతో తొక్కించి నిర్జించలేక —
అతిభ్రమించిన మనస్వినులకు ఉత్పలమాలికా
శీతలాత పత్రాలకప్పి సత్ఫల జాలికల
నిష్కృతి భజించి సేద తీర్చలేక —

ఏదో వ్రాస్తున్నాం గీస్తున్నాం కోస్తున్నాం
ఇది కవిత్వంకాదు చిత్రంకాదు ఏమీ కాదంటావా
బండి లేదు ఇబ్బంది సుతరామూ లేదు
మది తాపాలనడగించి మమ్మ్ క్షమించు ...
అన్యథా శరణం నాస్తి భగవన్!

ముఖారి రాగచ్ఛాయలో రాక్-ఎన్-రోల్ రచించే
వాగ్గేయ కారులం
ముఖాంబుజ సౌందర్యాన్ని భరించలేక
మిళింద సమూహంతో
మీసాలు కల్పించే చిత్రకారులం; కోరకుంటున్న నవ్యతతో
సవ్యతా భవ్యతలు విసర్జించే గేయకారులం,
ఆరు మూడయినా మూడారయినా
చేపట్టిన మార్గాలు విసర్జించని అసహాయశూరులం,
నిస్సహాయ భీరులం దీనులం మమ్మల్ని క్షమించు భగవన్!
కవిత్వం కాకపోతేనేంలే ఏదో
వ్రాస్తున్నాంకదా సంతోషించు!

ఉన్నత శృంగాగ్రాలపై నిలిచి ఉన్మత్త సృగాలాల భాతి
అరుస్తున్నాం-క్రతువేమిటో కర్తవ్యమేమిటో సంకల్పమేదో
శత్రువెవ్వరో మిత్రుడెవ్వరో తెలియని కోపావేశంతో
కనిపించిన ప్రతి కర్రనీ కరుస్తున్నాం; చీకు చింతలతో
విసివిగొంతెత్తి ఓండ్ర బెదుతున్నాం;
నిజం భగవన్, ఇది కవిత్వంకాదు
క్షమించవయ్యా క్షమించు; సహజయాన పంథుల
కుద్ధవరాహ విమర్శకుల మాపై సంధించకు!

బాత్ రూమ్లో నగ్నంగా జలకా లాడుతున్నపుడు
మాలో చెలరేగే భావ కలవరాల, డబుల్ డెక్కర్ బస్సులో
ప్రయణిస్తున్నపుడు అలవడిన ఖగేక్షణా కౌశలాల,
రీతిగాళలో ఆలపించలేక – హంసానందిని
స్వాధీనంకాక, కావలసింది స్వీకరించి
అక్కర్లేంది విసర్జించేందుకు
కనీసం బాతు ముక్కు పాళీలైనా దొరకక; కొంచ మంగేజ్
కించిదూరుదూ మిళాయించి అపస్వరాలు బనాయిస్తున్నాం ...

ఇవి కవిత్వాలు కావంటావా భగవన్ నిజంగా క్షమించు
వేళా పాళా ఎరుగని వేళాకోళాల
నిశిత కవిత్వాల్ని భరించు !

(రచన : జూలై 1964)

(ప్రచురణ : కవితాజ్యోతి వరంగల్ : మార్చి 1965)

చీకటిని ద్వేషిస్తాను

బైంకో జామున్నర దూరంలో చీకటి
మరో మైలున్నరలో నిష్క్రమిస్తుంది పగటి వెల్గు
నడుస్తున్న రోకళ్లు
పడుతూ లేస్తూ గెంతుతూ దొర్లుతూ
ఒకలిగా వస్తూన్నట్లు
గంటలూ తెప్పిటలూ ప్రమోయించుకుంటూ
కీచురాళ్లి గాకాలు పూరిస్తూ చీకటి
అదేం అదృష్టమో కొందరు చీకటిని
విరభ్యంతరంగా ప్రేమిస్తారు ! హాయిగా గొంతెత్తి
కీర్తిస్తారు ! చిమ్మెటలూ బొద్దెంకలూ
వారికి సైదోడు !

నాకు మాత్రం సుతలామూ చీకటి పడదు
నాకు మాత్రం వెలుతురుపై వేసట కలగదు
నామ మాత్రంగానైనా ప్రేమించలేను ఇరులు
భూతకాల భయంకర నిటలంపై కుటిలమైన కురులు

సువిశాలమైన కాస్మాస్‌లో
ట్వింకిల్ల ఉదారంగు కలల్ని
ఉదయపు ఒర్రని బెర్లిన్ వెలుగుల్ని

మధ్యాహ్న మార్తాండుని ధగద్ధగల్ని
ప్రేమిస్తాను ప్రాణపణంగా
శావేశంగా ఆహ్వానిస్తాను.

అరటి మొక్కలెత్తిన మొవ్వుటాకు బావ్రుటా
పెరకు గడలెత్తి ఝుళిపించే చిత్రజని కాగడా
కావేషీగుండెల్లో మెరిపించే మిణుగురేకు కటారు
సావేరి రాగచ్ఛాయల్లో నర్తించే చేకుచెట్లడాల్లు
ఇవన్నీ నాకెంతో ఇష్టం !
ఇహాలోక సౌందర్యాన్ని శ్రేణీకరించడం ఎంతో కష్టం
ఇంగితజ్ఞానాన్ని ఇంద్రియ సౌఖ్యాన్ని
విస్మరించడం మృతిసంకాశం చితాసదృశం !

తుఫానులా గర్జించే వాడికి
మిసాబుగాలి సరిపడదు
ఉప్పెన ఊడెయ్యడమే కర్తవ్యమైన వాడికి
ఉప్పరమైనా ఒక ఎత్తుకాదు

తమస్సుల్ని ద్రోమించే వాళ్లకి
ఉషస్సులు తెలియవు
రుగ్మోటరంలో కిలికే
గుడ్లగూబకే "భూపాల" పనేమిరాపడదు !

(15-3-68 : ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక)

విషాద జనుషాంధం

కొబేరుల అలకాపురాల్లో బ్రతకలేక
అలగాజనమంతా అవుతున్నా రుత్తసన్యాసులు
తమ కండ్ల కమండలాలలోని నీటిని
ఒంపుకుంటూ పోతున్నారు జల్లుకుంటూ
నోట్లోనే మంత్రాలు జపిస్తున్నట్టు
తమనోసటి వ్రాతల్ని తీట్టుకుంటూ
పోతున్నారు ... పోతున్నారు ...

ఏకాంతపు శూన్యాటవులలోకి !

రేషనుషాపులో బియ్యం దొరుకుతాయని
ఆకల శిఖరారోహణార్థం వీధిని పడిన సంసారి
అవమానాల ఖరారోహణంతో
వెనుదిరుగుతున్నాడు తిట్టుకుంటూ వేసారి ...

నిత్య నైమిత్తి కావసరాల అఖాతాలు దాటలేక
ఈతిబాధల చాత్రాయణంలో
తుప్పు దుల్లిపోతున్నారు త్రాణలేక

కళ్లంలోని ధాన్యంరాశిని
కళ్లప్పగించి కాపలాకాస్తున్న
కృషీవలుడొక ధ్యానరాశి
తూర్పార బట్టేపనికి తేలిన రహస్యం
నాల్గుకంటే పాళ్లే అధికతరం !

అరువడగడానికి వచ్చిన గుమాస్తాని
చూసీ చూడనట్లు కళ్లు తప్పించుకోవడం
కిరాణా షాహుకారి నిర్లిప్తతకు కారణాం
వర్తమాన బాధా పరంపరలనుంచి
పరమపదాన్ని సాధించలేని నేటితరం
కన్నులున్నా గగ్యంతరం తెలియని విషాద జనుషాంధం !

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)

(5-4-1968)

'ఇది సుదీర్ఘ చరమరాత్రి!'

వెళ్లిపోతాను నేస్తం నిశ్శబ్దంగా ఈ రాత్రి
నేనీలోకానికే అరుదెంచిన తొలివేకువ మక్కువలను
నలుకెలకుల వెదజల్లిన సద్భావపు విత్తనాల
నిశ్శంకగ ఏరుక, ఎరుకలన్ని జారవిడిచి
నీరవంగా హస్తచాలనం చేస్తాను; వెళ్లిపోతాను.

నే ననుభవించిన మృదుమంజుల జ్యోత్స్నా స్నాయువులకు
అగణిత రసమయ తీరంగాలకు వాయువులకు
నేనాఘ్రాణించిన శతసహస్ర ప్రసవాలకు
అంజలి ఘటియిస్తూ – వీడ్కోలర్పిస్తూ –
వెళ్లిపోతాను నేస్తం నిశ్శబ్దంగా ఈ రాత్రి

కరటకాల్వ గట్లపైన తలలూచిన
కాంచన ప్రసూనాల ఆర్ద్ర నయనాలకు
దివసాంతారుణ కిరణ స్నాతలైన
సరోజాల దిగజారిన కనురెప్పల దాగిన జలకణములకు
ఖోనేటికి నాడులుగా పిలపిల శబ్దించే
చిరుకెరటాలలజడులకు, అలలనడుమ భగభగమని

మండుతూన్న అస్తాద్రి కలల కిరణాలకు
నా హృద్గగనావధిలో
అమేయ భావాంబరాల తెగలించే
మోపించే అనంత సౌందర్యాలకు –
కేర్రోయిమంటిది – సెలవమనుతు
వెళ్లిపోతా నిశ్శబ్దంగా నేస్తం!

మెత్తని బొదడి మట్టిని కనులెత్తే వరి మొక్కలు
పటిసీట కాళ్లాడిస్తూ చిలిపినవ్వులురలించే కొమ్మలూ
కోమలగాత్రి గోదావరి నిర్మల తర తరంగాలు .
నను బాయని నెచ్చెలులై లాలించెను, పాలించెను ...
నేను కన్న కలలన్ని ఫలియించెను ...
అనంతానంద విహాయసమున విరియించెను నా కోసం
సెలవు తీసుకుంటానిక నేస్తం!
వలపులూరు లతాంతాలు కురిసిన నీరవ విభావరిని ...

గట్టుమీద రావిచెట్టు నీడవోలె నిమురించే తటాకమును,
తూరుపు బుగ్గపైన విరిసిన హరివిల్లుకు ముక్కవిరిగి
జారిపడిన పరవశించి పవళించిన పంటచేను,
ఆమని తుది యామినిలో
నింగి గుండె చిల్చిన ఒక పికనాదం,

తొలకరి తొలిచేపువలో సురలోకం దిగివచ్చిన
హర్షానిల వీచికగా పులకించిన వార్షుకమేఘం,
సకల మనోహరజగత్తు లీనమాయె ననుభూతిగ ...
నే ప్రబతికిన కాలమంత నా లోపలి శూన్యంలో
అనవరతం వెలుగులీను హృది మహేంద్రచాపంగా ...
మధురీకృత కవితాలత స్పష్టీభవించె ననాదిగా ...

చాలునింక నేస్తం, ఇది జన్మజన్మలకు సరిపడు
అనుభవ నిస్తులసారం; హాయిగ చిరునవ్వులతో
నిశ్శబ్దంగా వెళ్లిపోతా నీ రాత్రి!

మలయమారుతాల తేలి కలలొకనని పాషంగులు
పచ్చిక మైదానాలను పరువులిడని విస్సంగులు
నింగి తీవ ముడుచుకొన్న నునుమెత్తని వెలుగుపూలు
చీకటి గాఢగర్భం చీల్చుక వేగుచు సాగే
పడవయొకటిండా నింపుకోని జనుషాంగులు
వలపులూరు పాలిమేరల పులకరింత మజిలీలో
కేరింతల సంతసాలు పాడుకోని దాచుకోని భారవహులు
స్మృతిదాని పల్లేరులు జల్లినారు!

పోనీలే క్షమిస్తాను ... విస్మరించి విడుస్తాను ...
సెలవిమ్మని వెళిపోతా నిశ్శబ్దంగా నేస్తం!
కలకంఠం ఒకటైనా తోడువలదు ఈ రాత్రికిం

నా గొంతుక ఈక్షణాన ఫూడ్చుకుంది
నాగళమున నిగళమేదో గలగలమని ఒలుసుకుంది
పాడలేను
పాడలేను
బ్రతుకంతా పాడినాను కలలను కాపాడినాను
మునికీలని బాధలతో బ్రహ్మచెముడు డొంకబలిసి
పాడునూయిగా మారిన గొంతుక రాపాడిపోయె !
పాడలేను క్షమించుమిక పాంథశాల తలుపుమూసి
కావలి వాడరిగినాడు – తలారి వాడలిగినాడు;
వీడ్కో-లొసగే మురళీధ్వని మూగవోయి నిద్రించెను
సెలవిస్తే వెళిపోతా నిశ్శబ్దంగా నేస్తం !

కంటకములు కీటకములు
విహంగాలు తరంగాలు
సమస్తమూ నాకోసం మస్తకాలు ముకిళించెను;
పాశ్చిక ప్రతీచీ దిగంతాలు వీచిన
నవోల్లాస సమీరాలు స్తంభించెను;
సర్వకాంతి సాంద్ర కిరణశకలముగా రూపుదాల్చి
నేత్రజ్యోతిగ మారైను; నా హృద్గతనాదమాయె –
విశ్వమహోద్ధతనాదం ! నిశ్శబ్దం తాండవించె;
ఇది సుదీర్ఘ చరమరాత్రి హాయిగ నిదురిస్తానిక –
సెలవు తీసుకొని హాయిగ వెళిపోతానిక నేస్తం !

(వా గురుదేవులు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గొంతు స్రోవల వరద వారిన నిగ్ధ్ధులు హూోషించేవి. ఆ మహా కంఠనాదం వినిపించిన వందలాది కావ్య గానాలలో, కాలనియమాలను తుత్తునియ లొనర్చే మహోపన్యా సాలతో మా సంస్కారం పునీతమైంది. కేన్సర్ ఆపరేషన్‌తో ఆ మహా కంఠరవం మూగవోయిన తర్వాత దాదాపు ఒక దశాబ్ది గడచింది. 1967లో కాకినాడవచ్చి కొన్నాళ్లున్నారు. అప్పుడు వారి ఉపన్యాసం. మేఘాల్లని మహోహనిచే చదివించారు. ఆ విరచితోపన్యాసం వింటున్న నాకు గత మంతా స్మృతి పథంలో మెరిసి పోనారంభించింది. అప్పుడు నా హృద యంలో కొండకొక చైన్యం నిర్వటిల్ల నారంభించింది. కంఠాపం వ్యాపించ తొడగింది. నా కన్నులజ్రసంగా సజలాలై ప్రవహించాయి. ఆ అనుభూతి భారంతో ఎలాగో యింటికి. పిఠాపురం నిరిగివచ్చాను. నా గర్వస్వం కృష్ణశాస్త్రి మయమై ఘూోషించింది. ఆ పూనకంతో ఒళ్లు తెలియని స్థితిలో నాలుగు రోజులు గడచింది. చివరికి, నా పరిదేవన యావత్తూ మూర్తిగొని 19—6—1967 తేదిని ఈ కవితగా బయటపడింది. ఐనా నన్నాక్రమించిన విషాదం తొలగలేదు. అది ఈ జన్మకు తొలగేదీకాదు!

ఈ కవిత 1967 ఆగష్టు నెల సంచిక భారతి ప్రచురించినందు కంతో కృతజ్ఞతా పరిభూతమైంది నా హృదయం! దానిని చదివి చాలా మంది సాహితీ ప్రియులు లేఖలు రాశారు. ముఖ్యంగా నా కవి సోదరుడు — లేఖరాస్తూ, "భారతిలో నీ కవిత చాలాబాగుంది. కాని ఎందు కంత నిరాశ?" అని ప్రశ్నిస్తూ లేఖ రాశాడు. అప్పుడనిపించింది నాకు — నేనీ వివరణ అని ప్రచురించక పోవడంవల్ల కదా యింత తికమక వచ్చింది!.

ఒక కవితలో వ్యక్తంచేయబడే అశ నిరాశలు హృదయ జ్యోతి కడాపెడలాగా సంధించే వెలుగు నీడలు; స్థితి గతులను పారదర్శకంగా పట్టి చూపగలిగితే కవిత బాధ్యత తీరినట్లే! అంతే తప్ప కేవల వ్యక్తిగతాలు కావక్కరలేదు ఈ వివరణవల్ల గురుదేవులు కృష్ణశాస్త్రి, సమగ్ర ప్రతిభలో వెలలాడిన మా తరంవారికీ కవిత స్పృష్టి విస్మరణలదన్న ఆశ నాకుంది.—)

సోమసుందర్

నాగరిక వధూనిక

ఆధునిక కవిత్వ మొక
నాగరిక వధూనిక ...
ఆమె భర్త పాపం ఉత్త ఛాందసుడు
నత్తి మాటల సత్తి కాలపువాడు, పైగా పతివ
వెరసి వెర్రివాడన్నది తాత్పర్యం

అనగా వెర్రివాడి పెళ్లాం వాడవదిన
పతివాడు చేజేసుకోగల కుందరదన

వదిన అనగా
సౌమిత్రికి సీత వంటిదికాదు
సుగ్రీవుడికి తారవంటిది
సహదేవుడికి ద్రౌపదివంటిది

పురాణాల ఎన్సైక్లోపీడియాలో
అన్నింటికీ ఉన్నాయి సమానార్థాలు
కావలసినవాటికి కావలసినన్ని నమూనాలు

అహా ఆధునికాంధ్రుడా ... నాగరీకుడా ...
కిష్కింధాగ్రహారీకుడా ... కవితా పరాయణుడా ...
ఉగ్రగాటవీ మన్యస్థ చద్మవేష దిగంబరుడా ...
డా ... డా ... డా ... డా ...

(రచన : 10-8-67, ప్రచురణ : 21-10-67 కృష్ణాపత్రిక)

స్వప్నవాస్తవదత్త

ఆహా ఓహో చీకటే!
అనంత పరివ్యాప్త క్షుద్ధ్వభూకుటే .
ఎంత ప్రశాంత సాధువర్తన వయ్యావీ రాత్రి !
నా చేతిలోని కిమిడిన అపరూప గ్రంథానివిగా
నిన్నాద్యంతం పఠిస్తా నీ రాత్రి ...
నీ నుంచి అనాదినీ అనంతాన్నీ
ఆమూలాగ్రం పరిశీలిస్తా నీ రాత్రి...

1

కాలాగురు ధూపంగా నల్లగా మనోహరంగా
గర్భించబడిన రెండట్టలమధ్య
క్షుద్దండమైన చెలియలికట్టల మధ్య
ఏర్పాందిన తమస్సాగర మహాకావ్యాని వీవు.
ఒక అట్ట నింగికాగా – వేరొకటి నేల
రెంటి నడుమా అక్షయనక్షత్రాల అక్షరాలు
ఆద్యంత గహిత నిర్వేదనాగానాలు
సితాసిత వపుర్వల్లీ వికసిత లోచనాలు
జీవనాతీత తలాతల గభీర సోపానాలూ

సురవధూ అపాంగ వీక్షణా చాపాలు
గతానేక పతితాస్త్రోక కల్పశాఖా కుసుమస్తబకాలు
కుటిలాలకల మాపుల తూపుల పాశాలు
అరవిరిసిన తమాలకుట్మలాల సమ్మోహా నాస్త్రాలు

2

అబ్బా ... చీకటీ ... విష్వంలో !
నీలో ఎన్నెన్ని రహస్యాలు
పాతాళ లోకాల యిరుల దారులు
ఖరుణులలో నలిగిన మూల్గులు
దురాశా మనోరథచక్రాల వక్రదంతాల క్రింద పడి
లేవలేని హతాశుల ఆసహాయుల తుది ఆక్రందనలు
నిశీథరణు వేడి హాయిగ నిద్రించిన అర్ధ రాత్రిలో
హఠాత్తుగా విరిగిపడిన కొండకొమ్మ్ల, జలప్రళయం
అగ్ని పర్వతం – క్రక్కిన అనలద్రవ హాలాహలం
ఒక్కుమ్మడిగా తుత్తునియలుగా క్రుంచిన
ముంచెత్తిన, భస్మీపటలం కావించిన –
క్షతగాత్రుల, నీడలేని నిరాభ్యుల
అసంఖ్యాక శోకాకులిత మానవుల హాహాకారాలు –
ఓహో చీకటీ – నీలో ఎన్నిదుర్భర దుఃఖాలు ?
నీ హృదయంలో ఎన్నెన్ని వేదనామయ రహస్యరంగాలు ?

3

ఆకార వికార రహిత మహాధ్వాంత నిశీధీ
సుస్వర మురలించని సుప్తదుందుభీ
విశ్వమోహినికి యిరులే కురులై – కుటిలాలకలై
కబరీ భరమై, తారాకోరకాలు సిగపూలై
చిరు వెలుగుల పరిమళాల పరీరంభ
మొనరించునటే – చీకటీ!
నీవీలోకానికి చిరంతన సంగాతివైన దెప్పుడు!
భావోజ్జ్వల దీపిక జనతాహృత్కుహరంలో
శతసహస్ర దీప్తులతో వెలిగించినదెప్పుడు!
బీభత్స ప్రధానమై రసావేశ పేశలమై
పరగిన ఒక బృహత్కవిత వినిపించిన దెప్పుడు!
ఇందనీల శ్యామంతమణి ద్యుతుల
ఈ కుటిలో తెరలించిన దెప్పుడు!
శతకోటి తమస్సూత్రాలను కూర్చిన
సురభిళమాలిక జగతీగళాన కీలించిన దెప్పుడు!

4

ఆలనాడు కలలు కలలే
నా కుచ్ఛ్వాస నిశ్వాసాలైన జీవిత ప్రకరణంలో

యీవన మహాసాగర తటాన ఆసీనుడనై
ఒకతాతిలంలో ఒకేఒక్క లలనామణి
నామాక్షరాలు లిఖిస్తున్న తొలినాళ్లి మునిమాపులలో
నే నలిగి దూర దూరంగా పాదచారినై గడచి
ఏకాంతర వనాంతర సీమ కరగినపుడు
నా వెనకాలే మెల్లగవచ్చి చల్లని నిట్టూర్పు విడచి
నీ మెత్తని మంచు ముంజేతుల నా కన్నుల మూసినపుడు
నే నకస్మాత్తుగా హడలి కంపించినప్పుడు
ఘుక్కున నవ్వేన నీ వికటాట్ట హాసాలు –
ఉటిల నిశ్వాసాలు –నా లోపలి చెవిలో నెన్నాళ్లిలో
ఇంకా ప్రతిధ్వనిస్తూ ఉన్నాయి కదే చీకటీ!

5

ఒకనాడు విశాఖలో అల్లీపురం చౌరస్తాలో
మేడమీది బాల్కనీలో బహుజనుల మధ్యి జ్ఞాతవాసంలో
నిద్రరాక నేనొంటరిగా నన్ను నేనే వెక్కిరించుకుంటున్న
ముంటరి సాహసాల అంధకారపుటర్ధరాత్రిలో
నేనేకాకిగా ఆసీనుడనై నిన్నర్థిస్తూన్నప్పుడు
నా ఎట్ట ఎదుట నిద్రలో కదిలే నీడ మాదిరిగా
మెల్లగా నిశ్శబ్దంగా నడిచే ఛాయామూపిణి యొక్కతె

రోడ్డుప్రక్క బావిలో భళ్లున దుమికేసిన దృశ్యం
చూస్తూ చూడలేక – వింటూ వినలేక
నిస్సహాయత భయానకమై ఊపిరి పీల్చలేక
నా సర్వస్వాన్ని నిశ్చేతనత్వ మాక్రమించగా
విద్యుదాఘాతం నను ముంచెత్తగా
కెవ్వున కేకేసి మూర్ఛిల్లిన సమయంలో
నీవే కదే చీకటీ. ఆ నిర్భాగ్యురాలి దీనగాథ
నా చెవులకు వినిపించావు; చిరతర ముద్ర కలిగించావు!
ఎంతని వర్ణించను చీకటీ – నీ మహాత్మును?

6

వెదికాను వేదాల చతుశ్శాఖల
వనస్పతులతో నిండిన నైమిశారణ్యాలను,
శోధించాను బైబిళ్ల భూరాన్ల
ఉపనిషద్వీథుల గుయ్యారాలను,
కంటకమయ సంక్లిష్ట మార్గాల దుర్గమ బదరికావనాలను
నాకు ప్రతిచోటా సాక్షాత్కరించిన వొకే గాథలు
తమస్సముద్ర తరంగాల వివిధ విన్యాసాల రొదలు...
మానవ సముపార్జిత జ్ఞాన సింధువులో
నిబిడీభూత మానసికాజ్ఞానాంధ తమస్తిమింగలాలు
నరునిపైన కారాల్ మిరియాల్ నూరే రకరకాల వికారాలు

చీకటీ రోకటి పోటులనలిగే ఆర్తనాదాలు
ఆబ్బాహా ! చీకటీ, ఎన్నెన్ని నీ ప్రతాపాలు !
కనుకనే చీకటీ, నేను వాంఛించను సుతరామూ –
నీలో గుప్తాగుప్తంగా మార్మికంగా దాగొన్న మరణాన్ని;
కనుకనే చీకటీ, నే నారాధిస్తాను ఆద్యంతం
నిస్పృహకరించే, కార్మికమై ధిక్కరించే
జీవన సంఘుల్ల కిరణాన్ని
ఇస్సీ చీకటీ – పిశాచీ !
నీవెంత శక్తిమంతురాలవైనప్పటికీ!
ఒక్క నలుసంత వెలుతురు ముందు వీగిపోక తప్పదుకదే
కొండంత దూదిమేటు పిసరంత నిప్పు రవ్వకు
లొంగక తప్పదుకదే! ఓటమి తథ్యంకదే!

7

జాలిలేని గాలితుఫాను విజృంభించి నీకు సాయపడినప్పుడు
లోకం గుండెలలో మిణుకుమనే పిల్లాపిసరా
దివ్వెలారినప్పుడు;
నీ సహస్ర తమిస్రాచ్ఛ స్వరూపం విశ్వరూపమై
విశృంఖల మదేభమై మిడిసి పడినపుడు
రేయి రేయెల్ల శోకాకులిత నేత్రంగా, మృతగాత్రంగా
మూతపడినపుడు, ఇరులొక ప్రేతంగా పాడెను పడినప్పుడు

పాకిస్తాన్ యమనియంత కింకర శ్రేణులు
మానవతా ధర్మాల విడచి
అంబాలా జలంధర్ అమృతసర్ నగరాలలో
హాస్పిటళ్లపై పౌరుల ఇళ్లపై
మసీదుల చర్చిల గురుద్వారాలపై
బాంబుల అంగారవృష్టి కురిపించగా
న్యాయం చచ్చిపడినపుడు,
నీ వికటాట్ట హాసాలు చీకటీ —
బగాలకు జనాలకు మృగాలకు ఖగాలకు
భయభ్రాంతమై కోలాహల కేంకారమై,
శాపవహ్ని జ్వాలా తోరణమై
అనంతమై అగాధమై ప్రగాఢమై ప్రదీప్తమై
విరాడ్రూప సంకులమై నీరవ నిర్వేదమై విజృంభించి
కుటిల శర్వరీ నిటలంపై
ఆవిష్కృత రక్తధ్వజముగ
తూరుపులో దూరపు దిగ్భాంత రేఖల
అరుణోదయమైనట్లుగ తెలివెలి రేకుల
బాకుల తళతళల రీతిగ —
వీరవరుల అక్షౌహిణి లక్షకాంతి కిరణాలై
సాగెనులే సాగును చీకటీ !

నీపై అమేయ దీధితీమయ విజయోత్సవం !
అదే చైతన్య జీవన సుస్మేరోత్క్రమణం ...
అదే నా చిరంతన సమంచిత స్వప్నం ...
అస్మదమల తపఃఫల వాస్తవం ...
యాతనానుగత జీవితానుభవ దత్తం...
ఇతి శివమ్ ! ... ఇతి శివమ్ !!

(రచన కాలం : 1965 సెప్టెంబరు. బెంగుళూరులో)
(ప్రచురణ : భారతి, మార్చి 1966)

రెల్లు దిబ్బలు

కొలం వర్షాల వాగులలో
కావ్యాల కత్తిపడసలు ఒదులుతున్నాను
ఎన్ని ఒడ్డుకు చేరతాయో తెలియదు
ఎన్నిటికి తెడ్డు వెయ్యాలో తెలియదు

పగళ్లు నెగళ్లుగా రేలు ముసిరిన దిగుళ్లుగా
జగమంతా శరత్కాలంలో పూచిన రెల్లు దిబ్బలుగా
తిలకించాను వర్ణించాను కలవరించాను

మానషత్వం ఆరముగ్గిన మమకారంగా
మానవలోకం సౌజన్యాల ఆత్మీయతంగా
ఎన్నో ఊహించాను; ఎన్నో వర్ణించాను
సౌందర్యం సాక్షాత్కరిస్తే పులకరించాను
బీభత్సంమహానసంనలో పడగవిప్పితే జలదరించాను

ఎన్నికలలను సునర్ణించాను మితిమా!
ఎన్ని పన్నీటి తొలకరి జల్లులు వర్షించాను?
కొన్ని పన్నిన సాలిగూళ్ల వలలు
కొన్ని ఖద్దరు కోరమీసాల విషవలయాలు
లేగల్ని మ్రింగి అధికార వటవృక్షాల్ని.
చుట్టబెట్టుకొన్న కొండచిలువలు.

కొన్ని సైన్యిణీ నయనాంచల స్రుతవిషూతాలు
కొన్ని కట్టుతప్పిన వాగ్దానాల విషఫలితాలు
అన్ని అసంపూర్ణంగా విడిచిన అపభ్రంశ కళా చిత్రాలు!

నగర రథ్యలో హుందాగా నడిచే మకరాలు
శృంగాటక మధ్యంలో ఆటవిక
శృంగారోత్సవ కోలాహలాలు
సాల్వడార్ డాలీ చిత్రాలపలె జుగుప్సాకర దృశ్యాలు
మురికి చిమ్మేతున్న గొట్టాలు
చీకటి బీకిరిగా గుమికూడిన కండ చీమలు ...

పరిశ్నార్థకాలు ధరించిన మొండాలు
నిరాధారంగా నడుస్తున్న తలలు
కళ్లులేని మెదళ్లు; కదలని మెదళ్లకాళ్లు ...

ఎన్ని బొమ్మలుగీసినా ఫలితంలేదు –
కుంచెలూ రంగులూ ఉపయోగంలేదు
ఏలికల డొంకాలు పెనురాతి బండలు!

కాలం వర్షాల వాగులో సుడిగుండాల వాగురలో
కవితలు భవిష్యత్తుల తెరచాపలులేని కత్తిపడవలు ...

(రచన : 1–9–1966, ప్రచురణ : విశాలాంధ్ర 11–9–1966)

సుప్తనదిలో తప్తజలాలు

ఒకానొక సాయంత్రం
ఏటవాలుగా స్వచలితయంత్రం
వంతెన దిగుతూన్న వేగంలో
వేగం లాంటి గొర్రె పరుగులో
ఎదురుగా వస్తూన్న అతడ్ని చూశాను
అవనత ముఖుడ్ని చూశాను
వికటించిన మానవాకృతిని చూశాను

అన్నాడు కదా అతడు :
"ఎన్నో రోజులనుంచి వెదుకుతున్నాను
ఒక్కటే జవాబు విడుతున్నాను
గుండెలు పగిలించు కొడుతున్నాను
గడ్డిలాంటి దేవుడు తన్నుకుపోయాడు నా నేస్తాన్ని
నాలోని సమస్త చైతన్యాన్నీ
ఇనుపముక్కా ఉక్కుగోళ్లూ ఉన్న దేవుడు
నానుంచి చీల్చుకుపోయాడు."

అతడింక మాట్లాడలేక పోయాడు
మౌనంగా ఊరికే ఉండలేకపోయాడు

ఒగిర్చాడు మూలిగాడు ఎక్కిళ్లు పేర్చుకుంటూ
నిస్త్రాణగా కుంటుకుంటూ వెళ్లిపోయాడు.

వంతెన క్రింద నీళ్లు ...
అతని గండస్థల సానువుల్లో కన్నీళ్లు ...
సుప్త నదిలో తప్త జలాలు ...
జలతరంగిణి సోలో ప్రమోగిస్తున్న బాష్పాలు ...

వంతెన దిగువ దుఃఖాలు మురుగుతూన్న
సొలోఫులోంచి చప్పుచప్పున వెళ్లిపోతున్నాడు
హిమవత్పర్వత సానువుల్లో మందంగా ప్రాకే
తెల్లని శాంతిమయ భల్లూకాలువంటి మంచురాళ్లకీ
హౌరా బ్రిడ్జికింద అశాంతితో కళవెళ్లాడే
ఎర్రగా బురద కొట్టుకుపోయిన గంగానది నీళ్లకీ
మధ్య ఎక్కడో అతని నివాసం !

నిజం నిజం ! ఇది మహర్షులూ నివశించిన దేశం
ఋషి మౌని కానక్కర లేదు కవిక
ఇదే అతని సందేశం :
"వగసానువుల పాషాణ భర ఏకాంతాలలో
భగవాను డరుస్తున్నాడు నిశ్శబ్దంగా

ఏకాంత కాంతారాల దరిద్ర కాతరమైన
నల్లేర్లూ పల్లేర్లూ పండే ఊషరక్షేత్రాలకీ —
నదీతీరాల సమతలాల సారవంతంగా
ఒండ్రుపట్టిన కేదారాల పసిపిపంటల సుక్షేత్రాలకీ
నడుమపడిన వక్రరేఖల నీడలలో
తలదాచుకొంటున్నాడు దిక్కులేని దేవుడు ...
మానంగా నిశ్శబ్దంగా కుమిలి కుమిలి ఏడుస్తున్నాను!"

అన్నాడతడు; వేదాంతంలా నవ్వాడు
విరక్తిలా మొటికవిరిచాడు; అటవికంగా అరిచాడు
కర్మ సిద్ధాంతంలా తెల్లబోయాడు
విగత వర్షా మేఘంలా వెళ్లిపోయాడు వేగంగా!

భీతిజరేఖల వైపుకు మళ్లిపోయాడు
అప్పుడు చూశాను; అతని వెనకాల నీడలు
ఝల్లిఝల్లి ఏడుస్తున్నాయి; అడుగుల క్రిందిధూళిలో
విభూతిరేణువు లుజ్జ్వలిస్తున్నాయి
గాలిలో విషాదాలు నిశ్వసిస్తున్నాయి

నా చుట్టూ భయంకర పాషాణం లాంటి నిశ్శబ్దం
నీరవంగా ప్రతిరుతిస్తోంది నిశ్శబ్దం

వర్తులాకారపు టాలోచనల సుడిగుండాలలో
మునకలావటి వురావాంఛితా లీదుతున్నాయి

కనుచూపు దూరంలో అతడాగాడు
సల్లిశిలకీ చూపులు ప్రసరించాడు
అప్పుడు చూశాను అతనిగుడ్లలు నిజంగా పిలికలు
మాడిన అప్పడంలా లుంగచుట్టుకు పోయిందాతని కడుపు
శ్రామపీడిత దరిద్రాటవినుంచి తొందరగా
పారిపోయి వస్తున్న ఆగొన్న బెబ్బులిలా ఉందాతని ముఖం!

అతని రెండు నేత్ర గోళాలలోనూ
రెండు శ్రామార్త దేశాల వేలాది ఆకలి చావుల
అణురూప ప్రతిబింబాలు
అతడి లలాటంలో అసంఖ్యాక మహాగ్రంథాల ఓజస్సు
అతడి వక్షస్థలంలో దేశపటాల రేఖా చిత్రాల తేజస్సు

పడమటి జనుమల వెనుకగా జారిపోయి
ఆరిపోతున్న సూర్యుడి అఖరి కిరణాలు
బంధించాలన్న ఆరాటంతో అతని సయనాలు
నేత్ర సీమల అంతర్నిబిడ మూర్ఛిక గానాలు
గుప్తాగుప్త రహస్యాలు; తంత్రాలస దవానలాలు !

అతని గండపాళిలో సుప్తనదీ తప్తజలాలు
అతని గుండెవెనుక నీరవ శోకాకులిత
మర్మరస్వనాలు; పరిదేవనా జంత్ర స్వరాలు

అతని వెనువెంటనే అన్వేషణా పరతంత్రమైన
నా ఆలోచనల మేకపిల్లలు;
దగ్ధ పర్వతాల ధూమచ్ఛాయల్లో నిష్క్రమించాయి
అల్లంత దూరంనుంచి మూగబోతున్న అతని గొంతు
మోగబోయిన దొక్కటే ఒక్కమాట :
నా ... పేరు ... బీహార్ !
నా పేరే ... బీహార్ !

1966–67 సం॥లలో బీహారు కౌమం దీని ఇతివృత్తం

(రచన : 22–10–1967)

ప్రచురణ : జయశ్రీ ప్లవంగ సంక్రాంతి

తొలకరి మబ్బులు

నల్లని చల్లని మబ్బునై లోకం మీద
విహరిస్తాను; కొండ అంచుల మీద
పచ్చికపై హాయిగా అలవోకగా విడిసి
ఆటవిక ప్రజల పూరిళ్ల కప్పులపై ఎగసే
దుఃఖాల పొగల్ని ఆక్రందనాల ఆవిర్లని
నాలో కల్పుకుంటాను; అశ్రూసారంగా
కురుస్తాను, ఆనంద లోచనంగా
మెరుస్తాను; సంతోష భాజనంగా
ఉరుముతాను

నేను హర్షాన్ని
ఆచ్ఛాదాన్ని
ఘనాఘనాన్ని
అనర్గళ ఘోషా జలధరాన్ని
నాకు గావు లేదు
నాకు చావు లేదు
ప్రతి వర్షామృత వృష్టి నా పుష్టి
అకార రహిత సాకారం నా వ్యష్టి
నేను పర్జన్యాన్ని
నేనే ఋర్జన్మేఘాన్ని !

అవుడు కరచి నిదరబోతున్న అందాల చిట్టిపాప
తవుడు బూకుతూ గోచీతో వంతెనక్రింద నీళ్లో
కళ్ళపిళ్లచూస్తూ నిలుచున్న అనాథ బాలిక
ఉదయంనుంచీ కాణీ బోణీలేని తినుబండారాల
ఈగలు తోలలేని ముసలిదాని యాతన ...

హృదయం నిండా ఘోరచూపు తుపాకీల
అవమానాల తూటాలు దిగిన వాడవొదిన
కర్రువిరిగినా మేడి వదలని మేదకుని వేదన
అనదలందరికీ ఇదే నా అభయముద్ర!

ఆర్తులందరికీ ఇదే నా ప్రాణదీక్ష
సర్వసైన్యాలకీ నేడే శ్రీరామ రక్ష
కీడులన్నిటికీ శిరశ్ఛేదనా శిక్ష. !

నేను కారుణ్యాన్ని, కార్పణ్యాన్ని నేనే!
నేను సుస్మేరాన్ని, కుపితకులిశాన్ని నేనే!
నేను సౌజన్యాన్ని, దార్ఢ్యాన్ని నేనే !
నేడే కురుక్షేత్రంలో
భారత హృదయాన్ని కేంద్రీకరిస్తాను
నేడే ధర్మక్షేత్రంలో
పైప్లవ్య గీతాన్ని ఆలపిస్తాను !

(రచన : 1-9-66, ప్రచురణ : 18-9-66 విశాలాంధ్ర)

హేమంతనిశాంతం

"చలికాలపు వేకువ గాలులు
కొనగోళుల రక్కే బాకులు
స్మృతి వీచిక లేపిన వలపులు
గతకాలపు తీయని తలుపులు!"

నా ఎదలోపలి సారంగంలోని సన్నని సన్నాయివలె
పన్నీటి ఊటల సెలయేటి జలతరంగిణివలె
శేషాద్రిపై మన వివాహంనాటి జన్మప్రవాహ నిస్వనంవలె
వేణునాదం వినుపిస్తున్నది ప్రేయసీ!

(పొరబాటు, అది వేణునాదం కాదు
నీ వానాడు మన గదిలో నా ఎదలో
పాడినపాట; నా రక్తంలో మార్మ్రరించే
ఎన్నటికీ వాడనిమాట; మన కలలు
గుత్తులుగా మరుత్తులుగా గుభాళించిన
గులాబి పూదోట; సెలయేటిపాట !)

శీతకాలపు ఉదయపు గాలులు
మనసులో రేకెత్తిస్తున్నవి జ్ఞాపకాలు
వీధి కెదురుగా ఈజీ చెయిర్లో కూర్చుని

నిన్నే తలపోసుకుంటున్న నన్ను
అధిక్షేపిస్తూ సతాయిస్తున్నాడు బిచ్చగాడు;
బిక్కొటన నటనా శిల్పంలో ఆరితేరిన
గడుసు దెయ్యంలాగున్నాడు ! "రంగారంగా !"
అంటూ అరుస్తున్నాడు భయంకరంగా...
కంఠస్వరాన్ని వివిధస్థాయిల్లో సంధిస్తున్నాడు

మూడ్నెల్ల పసిపాప ఎందుకో ఏడుస్తున్నది ప్రక్కయింట
మిళాయించింది కొంచం బాధా, కొంత మురిపెం
కాస్తంతగారాం; ఓదారుస్తోంది తల్లి
తలనిమురుతుంది, ముక్కా తుడుస్తుంది
ఎవరో అడుగుతున్నా రేడుపుకు కారణం
వెంటనే అమ్మమ్మ జవాబు చెబుతోంది తెలిసినట్లు—
"మొగుడికోసం !... ఇంకెందుకు ఏడుపు !"

పిల్లి కోడమనురుమీద మెడుచుకు కూర్చున్నది
పిచిక రెక్కలున్న లడ్డుండలా ఎగురుతోంటే
కన్నార్పకుండా చూస్తోంది, గుటకలు వేస్తోంది
నా మనసెందుకో చిరాకు పడుతూంది
బిచ్చగాడు ... పిల్లి ...పిచిక ...ఏడుపు గొట్టుపిల్ల—
అనాసక్తంగా కల్లోలం రేగుతోంది నాలో

కన్ను లూరికే నిస్సంగత్వానికీ
నిరాసక్తతకో లోనవుతున్నాయి
అంతలోకే కలుక్కుమంటోంది గుండెగూడు...
తళుక్కు మంటోంది నీ జ్ఞాపకాల కొండపోడు ...

2

మళ్లీ నాలోకి నేను
హృదయంలోని పచ్చిక మైదానాలపై నేను
ప్రణయోత్సవ బృందావన మధ్యంలో
పొన్న చెట్టు నీడలో నేను...
నీ అంకపీఠిపై తలాన్చి వంశీగానం
పచరిస్తున్న నేను, నీ లాంబరిలో చరిస్తున్న నేను
నాలో – నాపై – నా క్రింద – నా అంతటా నిండిన నువ్వు
మేదిని కురిపించిన మేదురహాసంలా నువ్వు
తొలకరినింగి విరిసిన హరివిల్లు పులకరింతలా నువ్వు!

దూరంగా వినిపిస్తున్న తొందర పరుగులతో
సందడిస్తున్నాయి జలపాతాలూ; దుమికే
నిర్మలోదకధారలూ; సెలయేటి ఒడ్డు తెలి ఇసుకలో
ఆసీనులమై సమ్మృతిలో పాడుకొన్న ప్రణయ గీతాలు
క్షణక్షణ ప్రచలిత భావనా మధుర మందారాలు ...

మన శయన గృహావాతాయనంలో
తొలిసారిగా తొంగిచూసి మెల్లగా ప్రవేశించిన
హేమంత నిశ్శాంతం!

చలివేకువ గొంతుకొసల మొరసిన భూపాలరాగం!
ప్రత్యూషం పంపిన శీతలోర్మికా ప్రగాఢ పవనాంకురాలు
నాటికీ నేటికీ మనల్ని కవ్యిస్తున్న పులకాంకురాలు ...

గడచిన మధుమాసంలో నువ్వందించిన మాలలోని మల్లెలు
వాడని స్మృతులై – గతంలోంచి, నా డెయిరీలోంచి
నా హృదయంలోకి వెదజల్లుతూన్న ఎడతెగని సౌరభాలు!

నా లోపలి అరణ్యావాటికలోని భిల్లులు
నారి సంధించి వినిపిస్తున్న ధనుష్టంకారాలు ...
అబ్బబ్బా! నాలోకి నన్ను ముడుచుకోనీయని
నా లోపలి రంగుల జగత్తును నేను దర్శించుకోనీయని
నా హృదయాంబరస్థిగత చాంద్రీ వైభవాన్ని – నిన్ను
సమీక్షించుకోనీయని బాహిరకాకోలూకీయాలు!

విసిగించే బాధించే వాస్తవిక జీవితానేక దృశ్యాలు
వచ్చేపోయే సైకిళ్ల గంటల ప్రమోతలు; నడిచే పీతలు
రకరకాల వస్తువులమ్మ్మకొనే కేకలు

ఎరిగీ ఎరగని పిల్లల చేతలూ, తల్లి గుండె కోతలూ
కుట్టువాళ్ళి దీనాలాపాలూ, కష్ట పరంపరాపాతాలూ
ఘోరకుక్కల హాహాకారాలూ,
హోటలు రేడియోల వికటాట్ట హాసాలూ
నాలోని నిన్ను దర్శించసీయని అవకుంఠనాలు !

8

శృంఖలాబద్ధ శృంగారాన్ని సేవిస్తూ
అధికార శృంగాగాల స్వగాలాల్ని వీక్షిస్తూ
నగర శృంగాటకంలోని హాటకగర్భాల కంజలిస్తూ
ఆవున్నులతో అనుభవాన్నీ,
గడియారాలతో ఆయుర్దాయాన్నీ
ఓట్లతో పాలనార్హతనీ, కప్పులతో ఉర్విపాసల్నీ
నాణాలతో వాత్సల్యాన్నీ, మందస్మితాలతో సౌజన్యాన్నీ
కొలవ మంటోంది వర్తమాన కాలపు కొలువు !
అదే ప్రస్తుత వ్యవస్థ సాధించిన సులువు...

అబ్బబ్బా, చలి గీపెడుతోంది !
దవడలు రగడలు చదువుతున్నాయి
పెదవులు పలుపుతున్నాయి

సూర్యకిరణాలు ఎక్కెతున్నాయి క్రకర్ మంటూ
మలుగుతున్నాయి కొన్ని హృదయ హృదంలో

జారుతున్నాయి కొన్ని జ్ఞాపకాల నాపరాళ్లి పాకుడులో ...
తలపుల తెరచాప లెత్తని అనుభవాల నావలు
విషాదాల వానచినుకుల గుసగుసలు
సుషుప్తిలో పడగలెత్తిన పీడకలలు
తమంత తాముగా మరణిస్తున్నాయి కొన్ని
విషమ యోచనల విషనాగులు
ఒడ్డున పడిపోయిన మకరాలు !

పంచాగ్ని మధ్యంలో పార్వతి తపోనిష్ఠవలె
ముడుచుకు పోతోంది నా హృదయం
నీ కోసమైన తలపోతల ఎగరబోతలతో
దుమ్మ్ కొట్టుకుపోతోంది నా హృదయం
ప్రియతమా ! అందని వియత్తలంలో విహరిస్తావెందుకు?
నా గుండె పచ్చిక మైదానం -- ఒక్కసారి వాలరాదా?
ఆగరాదా, రారాదా? అంటూ ఒక్కటే రొదడెందంలో !

"ఆకలిబాబూ ! పట్టెడన్నం పెట్టించండి !"
భిక్షుకి ఆర్తారావం దూసుకుపోయింది నా అంతరంగం
"బియ్యం కేజీ రెండు రూపాయలట !..."
"అబ్బే అది మాత్రం ఎక్కడ దొరుకుతోంది ?"

పాంథుల సంభాషణ శ్రుతి మించింది
శోక సంతప్త రావంగా మారిపోయింది
అబ్బా – తామపీడిత జనపదంలాగుంది నా హృదయం
దెయ్యంలాగుంది, బ్రహ్మరాక్షసిలాగుంది–
మానవ హృదయం !
గరళం ఉమిసింది లాభార్జనా పరుల విషవక్త్రం !

కళకళలాడుతోంది మృత్యుజంఘుల సంక్షోభం
నాళాలలోని నెత్తురు, ఎమ్మెలలోని మూలుగు
పాదప పత్రాల హరితరసం – జీలుగు బెండులా మారింది ...
నిస్సారంగా తప్తంగా దగ్ధంగా మారింది బ్రతుకు !
లారీలపై ప్రయాణిస్తోంది నగరంలోని మురుగు
బ్యాక్ కార్లపై ప్రయాణిస్తోంది నరత్వంలోని వానరత్వం
ఎంత అత్తరు చల్లినా, ఏంలాభం, దాగుతుందా గబ్బు !

4

యుద్ధోన్మాదుల ట్రాక్టర్లు
పక్షపాత రహితంగా నేలనాలుగు చెరగులా
నాగేటి చాలుల్లో నరరక్తం నింపి
దమ్ము పడుతున్నాయి; నాటుతున్నాయి మిత్ర !

మానవ మస్తిష్కంలోని విస్మృత మమతా వీచిక
అంగారక గ్రహంలో తప్పకుండా దొరుకుతుంది
ఎగిరే సాసర్లు ప్రయోగిస్తున్నది!!
శోక చుక్కను భూమికి దూరబంధువన్న మనీషికి
వారసుడిగా పుట్టానన్న సన్నని గర్వం
నేటి కామెట్ "ఇకీసకీ" కలిగిస్తున్నది
ప్రతి దిన నిశాంత మందూ భూమ కేతు సందర్శనం
నాలో ఆసరేఖ మొలిపిస్తున్నది
వర్తమాన వర్తులాన్ని వెలిగిస్తున్నది
జాగృతీ మారుతాల హెచ్చరిస్తూన్నది !

తట్టుకోలేను ప్రియతమా—
ఈ దారుణ యోచనా నిదాఘ జంఝుల్ని...
భయోత్పాత ప్రభంజనాల రుంజల్ని...
ఆకట్టుకోలేను ప్రియతమా —
స్వప్న గరుత్తులు వాలుతున్న హృదయాన్ని...
జ్ఞాపకాల మేఘాలతో నిండిన వెన్నెల మాపుల్ని ...
పలవరించే కలువల జాలి చూపుల్ని ...
పలకరించే నెత్తుటేరుల ఝుంకారాల్ని ...
పులకరించే సంధ్యా స్మిత రేఖల్ని ...

ఆపుకోలేను ప్రియతమా ...
నీ కంఠస్వర మురళీరవాన్ని;
వైకుంఠనగరీ మనోహర దృశ్యాల్ని;
మామక మానసికాంతర్నిబిడ భావనారించ్ఛోళిని !

అలనాడు కలలు పండించుకొన్న తొలినాళ్ల అలకాపురిలో
మన మిరువురం ఒకే శ్రుతిలో ఘనతర స్వరంతో
శూన్యాటవులు ప్రతిధ్వనించేరీతిగా
పాడుకొన్న ప్రణయ గీతుల్ని
వెన్నెల మడుగులో ఆడుకొన్న జలక్రీడల్ని ...
నిభాయించుకోలేను ప్రియతమా !
హేమంతనిశాంత శీతువు
చేయెలలూపుతున్న ఉద్రేకాల్ని ...
అదేపనిగా క్రొక్కొటలాడుతున్న
ఎదలోని పాత తలపుల ఏకాముల్ని!

5

నిన్నటివరకూ దేశభక్తి అనీ
విప్లవ కార్యక్రమమనీ, పీడిత జనాల
హక్కుల సంరక్షణమనీ ఇల్లువదలి తిరుగుతూంటే —
బాధ్యతలేని అగమ్మకాకి నన్నది లోకం

పతన పాతనాయత్త చిత్తంతో
నిరంతర కవితా భావనామయ జగత్తులో
విహరిస్తుంటే ప్రస్తుతం – నిజమేనన్ను
నిష్క్రియా పరుడంటున్నది లోకం

ధనార్జనా ప్రయోజకత్వం సాధించనందుకు
వ్యర్థుడనీ సోమరినీ పిలుస్తోంది సమాజం
అనవరతార్ద్ర నయనాలతో సమాలోచించుకుంటూ
ఒంటరిగా గడుపుతుంటే – విరాగిననీ
దుఃఖభాజనుడననీ ఎలుగెత్తి పిలుస్తోంది జగత్తు !

ఎవ్వరేమంటేనేంలే – ప్రియతమా
నువ్వు నన్నర్థం చేసుకున్నా వంతేచాలు !
అపార్థాల హిమయవనికల విడళించగలవు
పాలేయాంబుశీకరాల మన చెలిమిపై రాలనీయవు
మన పసిడి ప్రబంధుల దాంపత్యాన్ని
కదుష్ణ పరిచుంబనంగా, ప్రగాఢ పరీరంభణంగా
ఒకే తొడిమకు విరిసిన జంట మందారాల నవతేజంగా
పారిజాతసుమాల నిశ్శాంత సురభిళంగా
పల్లవింప చేయగలవు ! ఈషణాత్రయలోపాలను
సమర్థించగలవు; ఒంకరటింకరల సరిదిద్దగలవు !
నిస్తేజః పరిసరాలు పునరుజ్వలించగలవు...
వెలిగించగలవు ప్రాణస్పందనా జ్యోతులను !

ప్రతి దినమూ ఉషస్సునీరం నా గృహావాతాయనం
లోనికి లీలగా తొంగిచూసి పలకరించేసరికి
ఉత్సాహంగా వాకిలి తెలుపుతీసి నిరీక్షిస్తూ
ఏదో ఒక థ్రిల్లింగ్ మెసేజ్ కోసం
నీ క్షేమ సమాచార కల్హార ప్రసరణకోసం
ఎదలో నస్సెన్నుల పట్టుదారాలు పేని
ఎదురుచూడటం అలవర్చుకొన్న నేను
నిశ్చేతనంగా పగలంతా గడపడం నేర్చుకున్న నేను
అవకాశాల కాంచనరేఖల
నెన్నో పోకార్చుకొన్నాను

నేడెందుకో భవిష్యద్దర్శనానికై
భయకంపితుడ నవుతున్నాను!
పగళ్లు మండే నెగళ్లుగా
రాత్రులు విలయకాల రాత్రులుగా
నిట్టూర్పులై కర్పూరపు హారతు లవగా
శివధను వెత్త లేక క్రిందపడిన పౌలస్త్యుని మాదిరిగా
విషాదించి కునారిల్లి పోతున్నాను నిరాశలతో!
నిన్నటి కన్న నేడు – నేటి కన్న రేపు
అద్భుత రామణీయక మనుకొన్న నాకు
దుస్తంత్రీవాదుల ధూర్తుల పరిక్లిన్న చేతస్కులై
చెయిదాలవార్తలు అనవరతగ్లాని కలిగిస్తూన్నవి!

హాహాకారాల మహాగ్నిశిఖలు
చుట్టూ కమ్ముకొస్తూన్న నన్ను
ఏమని కవిత్వం రాయమంటావు ప్రేయసీ!
ఈ హేమంత నిశీథంలోని శీతల వాతూలాలు
వాడి బాకుల మొనలతో చీలుస్తూన్నప్పుడు
ఆమనుల గురించి ఏ నిష్ఫల కామనలతో
కవిత్వ మల్లమంటావు ప్రేయసీ!
బస్తీలో చారస్తాలో అడ్డుతగిలే బిచ్చగాళ్ల ఆర్తనాదాలు
ధూర్తపరిలాపాలతో రిక్షావాళ్ల పోటీ ఆహ్వానాలతో
ఎత్తుమడమల వాల్గంటుల క్రీగంటి చూపుల సాలిగూళ్లలో
నారీల భారీ మృత్యు రవాణా ఛాయల్లో
తరుము కొస్తున్నట్టు పరుగులిడే
కలిమిగల కారుల పోకిరీ చూపుల్లో
తొందరలో, కర్కశధ్వానాల వేగంలో, జాగా లేదు!
తీరిక లేదు; శాంతి లేదు; స్థిమితంలేదు!
ఏమిటి రాయమంటావు ప్రేయసీ కవిత్వాలు?
ఎలా నింపగల నంటావీ లోకంపై భరోసాలు?

అధికార పాదాలముందు తలలాడించే తోకలు
తోకలాడించే తలలు; చిరునవ్వుల చిరుతపులులు
కాకాపట్టే నక్కలు; నక్కలు వెదికే పీత బొక్కలు
భోగిత్ బొక్కలనిండా కులకులలాడే కులటలు
కులటల్ని అదరకొట్టే పోలీసు లాఠీలు ...!

ఈ దేశపు జీవన ఝరి
ఎలా కుటిలమవుతోంది, చూడలేను పోయసీ
సర్జీవన వనవైభవమది భరించలేను
గర్జారవ కంకాళాల్ని దగ్ధించలేను
నిర్జనారణ్యాల హృదయంలేని అధికారాన్ని తరించలేను
వసించిన గత శోభా భారాన్ని స్మరించలేను
భారత నందనవనం నలుమూలలా ప్రమోదులు
ఎండిన నదుల దయతప్పి గతిమాలిన బీదలు
ఆశలకంకాల్ని ఉత్తరిస్తున్న విషవలయాల ఉరితాడులు !
పిస్మృతి పెంచుకుంటున్న స్వార్థం పాలించే వల్లకాడులు ..

దేశీయ జనజీవన వైక్లబ్యాన్ని
గ్లానిని హానిని, మ్లానవదన విభ్రాంతిని, క్లాంతిని
వీక్షించలేను ప్రేయసీ, సమీక్షించలేను !
భవిష్యధ్వస్తాల కాంచన శీకరాలలోరకై
నిరీక్షించలేను ! ప్రేయసీ, పరీక్షించలేను;
నిరాశాహతమై సొమ్మసిలిన నగ్నమానవ కళేబరాల్ని
అధికధరల కండచీమలు పీక్కు తింటున్న దృశ్యాల్ని
విధురానలావృత మధురస్మిత ప్రసవాల్ని
చెదలుపట్టిన మూఢక మనోజ్ఞకావ్యాన్ని !

వేలాది వెన్నెలకలల తరపి తేనెలతో
పరిపోషించుకున్న నా యీ దేశాన్ని
మానుషహృదయంలో పరకాయ ప్రవేశం
చేసినపిశాచం పీల్చుకుతింటున్న కోశాన్ని
చూడలేను ప్రేయసీ చూడలేను !

భవిష్యత్తు నాకట్టెదుట నగ్నంగా వక్రంగానిలచి
నిలిపి ప్రశ్నించుతూంటే – ఏమని సంజాయిషీ ఇవ్వగలను?
నా అనుగాముల కేవారసత్వ మందించగలను ?
ఏవిధి నా ప్రజలకు భరోసా తెల్పగలను ?

ప్రతి చోటా ఆకలి, అశాంతి, ఆవేశం
ప్రతి ఇంటా నిరీహ, నిస్పృహ, నైరాశ్యం
ప్రతి వేదికనుంచీ విషద్రవాల జలపాతం
ప్రతి గుండెలోంచి పడగ విప్పిన
వక్రయోచనల విషనిశ్వాసం
నా ఈ వర్తమాన భారతిని దర్శించి
ఎలా గర్వపడమంటావు ప్రేయసీ !?

రచన కాలం : 1965 డిశంబరు : ఇటీసకీ దర్శనకాలం
ప్రచురణ : విశాలాంధ్రలో : 1966 ఫిబ్రవరి

లోహితకవచం

నేను కవనాన్ని ...
సుందర సుమభరితవనాన్ని
రాగల కాలాల వారసులకోసం
నిర్మిస్తున్న కాంతిమయ భవనాన్ని
జవరాలి జడలోకులికే దవనాన్ని
శ్రమజీవన సురుచిర స్వప్నాన్ని

నేను కవనాన్ని ...
రేపటి రేపకడకు పయనించే
వేవెలుగుల జవనాశ్వాన్ని
సమస్త ప్రాణవాయువులూ ఎగదట్టేగవాహాన్ని
కాలుష్యకాతరమైన వర్తమాన నిర్వేదాలకు మోహాన్ని
సమరోన్మాద విషజంఝూఘాతాలకు లోహితకవచాన్ని
భవిష్యత్తుకు కలయూపాదవించే రేఖా చిత్రాన్ని

నేను కవనాన్ని...
నరజీవన సవనాగ్నిలో ప్రభవించే పరువాన్ని
అరవిరిసిన స్మృతికన్య వాల్జడలోని మరువాన్ని
చెంగలి చివురుల కొరుకుతూ

సెలయేటి నీటిని గోలతూ
చెంగలించే వెలుగుకలలహారిణాన్ని
పరభాషోపజీవనుల స్వార్థాలకు మరణాన్ని

నేను కవనాన్ని
కొండు నాలుక్కల వక్రనీతి కుటిలాత్మక వినాశనాన్ని
లంచాల మంచుకొండల రెక్కల్నరికే కులిశాన్ని
వర్తమానానికీ భవిష్యత్తుకీనడుమ
వేలాడుతూన్న ఇనుప తెరల ఖండించే కరవాలాన్ని
సంగిలాపులు సతాళ సంకేతాలైన
హోమార్థ ఘోషానికి మృష్టాన్న సృష్టిని !

- 0 -

8-4-68 ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

రచన : 11-11-67

D

1

D

2

KABB129B161

"SOMASUNDER Avadhsa, (18th November, 1924) commenced with attacking the tyranny of the bourgeois and declared his desire to build a world of Kuchelas on the ruins of the Kuberas. He held for a time his VAJRAYUDHAM to vanquish Nazism in the land of Nizam. He condemns even god and says,-He is a wretched god of stone with stony heart and bereft of the sense of hearing, because the rich have purchased him and poured into his ears molten lead" —
Dr. Gidugu V. Sitapati.
From : History of Telugu Literature, Page 198 (Sahitya Akademi)



His famous VAJRAYUDHAM collection of poems which is a corner stone of progressive movement in Telugu Poetry, came in 1949. Somasunder carved a place for himself in the modern poetry of Telugu mainly by virtue of his scholarship, training and deep awareness of time.

Analakireetam — a kalakeli publication presents here the selected poems of Somasunder covering the span of time from June 1963 to November 1968. All the poems here are of vers-libre which mark his flowery. style and poetic genius.

ANALAKIREETAM
SOMASUNDER.

A Kalakeli Publication
Price : Rs. 5/—

BCA

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KABB129B161
పుస్తకం పేరు	అవలకిరీటం
తారీఖు	12 June 2024
ముందు అట్ట	
వెనక అట్ట	
మొత్తం పేజీలు	117
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	APSAR
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	